నేత్రపర్వంగా ఏకాంబరనాథాలయ

మహాకుంభాభిషేకం

పంచాక్షరితో ప్రతిధ్వనించిన కంచి క్షేత్రం

చెన్నై, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పంచభూత క్షేత్రాల్లో పృథ్వీక్షేత్రమైన కాంచీపురం ఏలవార్‌కుళలి సమేత ఏకాంబరనాథ ఆలయ మహాకుంభాభిషేక వేడుక సోమవారం వేకువజామున వివిధ మఠాధిపతులు, శివాచార్యులు, వేద పండితులు, వేలాదిమంది భక్తుల సమక్షంలో ఘనంగా జరిగింది. ఈ ఆలయంలో రూ.29 కోట్లతో జీర్ణోద్ధరణ పనులు చేపట్టారు. 2023 జూన్ 28న బాలాలయం ఏర్పాటు చేసి, ఆ తర్వాత ఆలయ ప్రాచీనతకు భంగం వాటిల్లకుండా జీర్ణోద్ధరణ పనులు ప్రారంభమయ్యాయి. ఈ పనులన్నీ ముగియడంతో ఆలయ ప్రాంగణంలోని శివగంగ తీర్థకుళం సమీపంలో 170 మంది శివాచార్యులు, 170 మంది వేద పండితులతో నవగుండ యాగశాలలో పూజలు అనుజ్ఞ విఘ్నేశ్వర పూజతో ప్రారంభమయ్యాయి. 30 మందికి పైగా ఓదువార్లు వివిధ వాయిద్యాలతో తిరుమురై పారాయణం చేశారు. సోమవారం వేకువజాము 5 గంటలకు యాగశాల నుండి పవిత్ర జలాల కలశాలను ఆలయ అర్చకులు వేదపండితుల మంత్రోచ్చారణ, మంగవాయిద్యాల నడుమ రాజగోపురం పైకి తీసుకెళ్లి, ఉదయం 6.10 గంటలకు మహాకుంభాభిషేకం నిర్వహించారు. మూలవిరాట్టు గోపురంపై కంచి కామకోటి పీఠాధిపతి విజయేంద్రసరస్వతి, యువపీఠాధిపతి సత్య చంద్రశేఖరేంద్ర సరస్వతి సమక్షంలో గోపుర కలశాలపై పవిత్ర జలాలను ప్రోక్షించారు. ఆ తర్వాత మూలవిరాట్టుకు, పరివార దేవతలకు ప్రత్యేక అభిషేకాలు, దీపారాధన చేశారు. ఆలయ ట్రస్టు బోర్డు ఛైర్మన్ ఎంవీఎం వేల్‌మోహన్ నాయకత్వంలో ట్రస్టు బోర్డు సభ్యులు ఆలయ డిప్యూటీ కమిషనర్ సి.కుమారదురై, ఆలయ కార్యనిర్వహణాధికారి పి.ముత్తులక్ష్మి తదితరులు ఈ వేడుకలకు హాజరైన భక్తులకు సకల సదుపాయాలు కల్పించారు. కాంచీపురం తొండైమండల ఆధీనం చిదంబరనాథస్వామి, ధర్మపురి ఆధీనం మాసిలామణి దేశిక జ్ఞాన సంబంధ పరమాచార్య స్వామి, మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి దీప్తి అరివుమది, కాంచీపురం జిల్లా కోర్టు మేజిస్ట్రేట్ మోహనాంబాళ్, లేబర్‌కోర్టు మేజిస్ట్రేట్ సుజాత, కాంచీపురం ఎమ్మెల్యే ఎళిలరసన్, స్టేట్ బ్యాంక్ చీఫ్ మేనేజర్లు మణికంఠన్, బాలమురుగన్ తదితరులు పాల్గొన్నారు. కుంభాభిషేకరం సందర్భంగా ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. పలు స్వచ్ఛంద సంస్థలు భక్తులకు అన్నదానం చేశాయి. కాంచీపురం ఎస్పీ షణ్ముగం నేతృత్వంలో సుమారు వెయ్యిమందికి పైగా పోలీసులు భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా బందోబస్తు కల్పించారు.


మహాకుంభాభిషేకంలో కంచి కామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి, యువపీఠాధిపతి సత్య చంద్రశేఖరేంద్ర సరస్వతి తదితరులు

హాజరైన అశేష భక్తజనం




దట్టమైన మంచుతో కోయంబేడు ఫ్లై ఓవర్

మంచు పరదాల మాటున

మహానగరం

● రాష్ట్రంలో పెరిగిన చలి తీవ్రత

పెరంబూర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని నగరం చెన్నైతో పాటు శివారు ప్రాంతాలను మంచుదుప్పటి కమ్మేస్తోంది. ఉదయం 7 గంటలకు కూడా శివారులో దట్టమైన మంచు కురుస్తుండడంతో వాహనాలు రోడ్లపై తిరగడం గగనమైపోతోంది. రాష్ట్రంలో నైరుతి పవన వర్షాలు అక్టోబరు 16న ప్రారంభమవడంతో విస్తారంగా వర్షాలు కురిశాయి. ఇటీవల 'దిత్వా' తుపాను ప్రభావంతో నగరంలో నాలుగు రోజులు వర్షాలు కురవడంతో వాతావరణం చల్లబడింది. ప్రస్తుతం, వర్షాలు తగ్గిన నేపథ్యంలో, నగరం, శివారు ప్రాంతాల్లో తెల్లవారు జామున దట్టమైన మంచు కురుస్తోంది. మరో వారం రోజులు ఇలాంటి వాతవరణమే ఉంటుందని వాతావరణ కేంద్రం తెలిపింది. అలాగే వీచే తూర్పు గాలుల వేగంలో మార్పు కారణంగా, రానున్న 48 గంటల్లో రాష్ట్రం, పుదుచ్చేరి, కారైక్కాల్‌లోని ఒకటి, రెండు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం తెలిపింది.

బీజేపీ కూటమిని

తరిమికొట్టండి

200 స్థానాల్లో విజయమే లక్ష్యంగా పాటుపడండి ● డీఎంకే జిల్లా నేతలకు స్టాలిన్ దిశా నిర్దేశం

చెన్నై, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మాయమాటలతో ప్రజలను మోసగించి రాష్ట్రాన్ని కబళించేందుకు సిద్ధంగా ఉన్న బీజేపీ కూటమిని తరికొట్టాలని, అసెంబ్లీ ఎన్నికల్లో 200 సీట్లలో విజయమే లక్ష్యంగా ఇప్పటి నుంచే డీఎంకే జిల్లా కార్యదర్శులు, పోలింగ్ కేంద్రాల ఇన్‌చార్జులు, నియోజకవర్గాల ఇన్‌చార్జులు సమష్టిగా కృషి చేయాలని ఆ పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పిలుపునిచ్చారు. తేనాంపేటలోని అన్నా అరివాలయంలో సోమవారం ఉదయం పార్టీ జిల్లా శాఖ కార్యదర్శులు, పోలింగ్ కేంద్రాలు, నియోజకవర్గాల ఇన్‌చార్జుల సమావేశం జరిగింది. ఆ సమావేశాన్ని ఉద్దేశించి స్టాలిన్ నేతలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సర్ ప్రక్రియ పూర్తయి ముసాయిదా ఓటర్ల జాబితా విడుదలైన తర్వాత కూడా పార్టీ శ్రేణులు ఆ జాబితాలోని తప్పిదాలు, చేయాల్సిన సవరణల గురించి ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్ళాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా నేతలు, పోలింగ్ కేంద్రాల ఇన్‌చార్జులు ఐకమత్యంగా పనిచేయాలని, రాష్ట్రంలో మళ్ళీ డీఎంకే ప్రభుత్వమే అధికారంలోకి రావాలనే ఆకాంక్షతో ప్రతి ఒక్కరూ కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ప్రత్యర్థులను తక్కువగా అంచనా వేయకూడదని, డీఎంకే సుపరిపాలనపై వారంతా బురదజల్లే ప్రయత్నాల్లోనే ఉంటారని, వారి మాటలకు ప్రజలు మోసపోకుండా పార్టీ శ్రేణులు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం చేయాలన్నారు. గడిచిన నాలుగున్నరేళ్లలో డీఎంకే ప్రభుత్వం అమలు చేసిన పథకాల ద్వారా కోటి 86 లక్షమంది ప్రత్యక్షంగా లబ్ధిపొందారని స్టాలిన్ చెప్పారు. శాసనసభ ఎన్నికల సమయంలో ఎన్ని కూటములు ఏర్పాటైనా, ఎన్ని కుయుక్తులు పన్నినా రాష్ట్రాన్ని మళ్ళీ పరిపాలించనున్నది డీఎంకే ప్రభుత్వమేనని, పార్టీ శ్రేణులను, జిల్లా కార్యదర్శులను ఉత్సాహపరిచేందుకు తాను ఈ మాటలు చెప్పటం లేదని అదే వాస్తవమని చెప్పారు. ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసి వారూ ప్రభుత్వంపై చూపించే ఆదరణ చూసి ఓర్వలేకే ప్రత్యర్థులు సీబీఐ, ఈడీ, ఐటీ, ఎన్నికల సంఘం తదితర సంస్థలను డీఎంకే నేతలపై ఉసిగొల్పుతున్నారని స్టాలిన్ విమర్శించారు. ఇంటింటి ప్రచారం చేసే బూత్ కమిటీల్లో మహిళలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల ఇన్‌ఛార్జులు మరో నాలుగు మాసాలపాటు తమకు కేటాయించిన ప్రాంతాల్లో ప్రచారం చేయడంపైనే దృష్టిసారించాలని స్టాలిన్ సూచించారు. ఈ సమావేశంలో డీఎంకే ప్రధాన కార్యదర్శి దురైమురుగన్, కోశాధికారి టీఆర్ బాలు, ముఖ్య కార్యదర్శి కేఎన్ నెహ్రూ, యువజనవిభాగం నాయకుడు, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి తదితరులు పాల్గొన్నారు.



జిల్లా నాయకులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న డీఎంకే అధ్యక్షుడు స్టాలిన్

గవర్నర్‌ను అవమానించడం

ఆమోదయోగ్యం కాదు

● ఆ విద్యార్థినిపై చర్యలు చేపట్టవచ్చా?
● 'మనోన్మణియం' వర్సిటీని ప్రశ్నించిన హైకోర్టు
● పూర్తి వివరాలు సమర్పించాలని ఆదేశం


వీసి నుంచి డిగ్రీ పట్టా తీసుకుంటున్న విద్యార్థిని (ఫైల్‌ఫొటో)

పెరంబూర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): విశ్వవిద్యాలయ స్నాతకోత్సవంలో గవర్నర్‌ను అవమానించే విధంగా వ్యవహరించిన విద్యార్థిని చర్యలను ఆమోదించలేమని మద్రాస్ హైకోర్టు వ్యాఖ్యానించింది. తిరునల్వేలి మనోన్మణియం సుందరనార్ విశ్వవిద్యాలయ స్నాతకోత్సవం ఆగస్టు 13వ తేదీ జరగ్గా, గవర్నర్ ఆర్ఎన్ రవి చాన్సలర్ హోదాలో విద్యార్థినీ, విద్యార్థులకు డిగ్రీలు అందజేశారు. ఆ సమయంలో జీన్ జోసఫ్ అనే విద్యార్థిని గవర్నర్ నుంచి తన డిగ్రీ అందుకోకుండా, గవర్నర్ పక్కనే ఉన వైస్ ఛాన్సలర్ చంద్రశేఖర్ నుంచి స్వీకరించింది. బహిరంగ వేదికపై జరిగిన ఈ ఘటన రాష్ట్రంలో చర్చనీయాంశమైన విషయం తెలిసిందే. గవర్నర్ తమిళనాడుకు తమిళ ప్రజలకు వ్యతిరేకంగా పనిచేస్తున్నారని, అందుకే ఆయన నుంచి డిగ్రీ అందుకోవాలనిపించలేదని విద్యార్థిని తెలిపింది. ఈ క్రమంలో గవర్నర్ నుంచి డిగ్రీ పొందకుండా, ఆయన్ని అవమానించిన విద్యార్థినిపై చర్యలు చేపట్టాలని కోరుతూ హైకోర్టు మదురై ధర్మాసనంలో పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్‌పై సోమవారం విచారణ చేపట్టిన న్యాయస్థానం... విద్యార్థిని ప్రవర్తన ఆమోదయోగ్యం కాదని వ్యాఖ్యానించింది. గవర్నర్‌ను అవమానించిన ఆ విద్యార్థినిపై చర్యలు తీసుకునేందుకు విశ్వవిద్యాలయాల చట్టంలో నిబంధనలేం చెబుతున్నాయో వివరిస్తూ కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని సదరు యూనివర్సిటీ యాజమాన్యాన్ని ఆదేశించి,తదుపరి విచారణను ఈ నెల 18వ తేదీకి వాయిదావేసింది.

స్టాలిన్ పాలనలోనే హాస్టళ్లలో బాలికల అదృశ్యం

● బీజేపీ నేత నయినార్ నాగేంద్రన్

చెన్నై, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మహిళాభ్యుదయం దిశగా తమ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో రాష్ట్రంలో బాలికలంతా తనను 'అప్పా' (నాన్నా!) అని పిలుస్తున్నారంటూ గొప్పలు చెప్పుకుంటున్న ముఖ్యమంత్రి స్టాలిన్ పాలనలోనే ప్రభుత్వ హాస్టళ్లలో బాలికల అదృశ్య సంఘటనలు అధికమవుతున్నాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ ఆరోపించారు. కన్నియాకుమారి, నాగపట్టినం, శివగంగ తదితర జిల్లాల్లోని ప్రభుత్వ వసతి గృహాల నుండి బాలికలు అదృశ్యమవుతున్నారని, కిడ్నాప్‌కు గురవుతున్నారనే వార్తలు తమను తీవ్రదిగ్భ్రాంతికి గురిచేస్తున్నాయని తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన తన ఎక్స్ పేజీలో ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రతియేటా పోక్సో కేసులు అధికమవుతున్న డీఎంకే పాలనలో ప్రభుత్వ సంరక్షణ కేంద్రాల నుండి మాయమైన బాలికలు లైంగిక వేధింపులకు గురవుతున్నారా? లేక వారిని వ్యభిచారకూపంలోకి నెట్టి వేస్తున్నారా? అనే ప్రశ్నలకు ప్రభుత్వం బదులివ్వటం లేదని ఆరోపించారు. బాలికల మాయం కేసులతో ఆయా హాస్టల్ వార్డెన్లు, అధికారులు, రాజకీయ నాయకుల ప్రమేయం ఉండవచ్చనే అనుమానాలు కూడా కలుగుతున్నాయన్నారు. ఒక వేళ ప్రభుత్వ వసతి గృహాల్లో వేధింపులకు కూడా భయపడి బాలికలు పారిపోయి ఉంటారని, సీఎం స్టాలిన్ పాలనలో బాలికల అదృశ్యం కేసులు అధికమవుతుండటం డీఎంకే ప్రభుత్వం సిగ్గుపడాల్సిన విషయమని నయినార్ నాగేంద్రన్ అన్నారు.

టీవీకేతో పొత్తుకు కాంగ్రెస్, డీపీఐ తహతహ

నటుడు విజయ్ నాయకత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే)తో పొత్తు పెట్టుకునేందుకు డీఎంకే మిత్రపక్షాలైన కాంగ్రెస్, డీపీఐ తహతహ లాడుతున్నాయని నయినార్ నాగేంద్రన్ విమర్శించారు. గుమ్మిడి పూండిలో ఆదివారం రాత్రి జరిగిన బీజేపీ బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. తిరుప్పరంకుండ్రంలో కార్తీకదీపం వెలిగించాలని కోర్టు ఉత్తర్వు జారీ చేసినా డీఎంకే ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, ఈ వ్యవహారంపై సుప్రీం కోర్టులో తగిన సమాచారంతో అప్పీలు వేయకుండా డీఎంకే ప్రభుత్వం అభాసుపాలైందన్నారు. డీఎంకే ప్రభుత్వ తీరు నచ్చకే కాంగ్రెస్, డీపీఐ పార్టీలు టీవీకేతో పొత్తు పెట్టుకునేందుకు రహస్య మంతనాలు జరుపుతున్నాయని ఆరోపించారు.

బుధుడి ఆలయంలో దుర్గాస్టాలిన్ పూజలు

ప్యారీస్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మైలాడుదురై జిల్లా సీర్గాలిలో బుధుడి క్షేత్రంగా ప్రసిద్ధి చెందిన శివాలయంలో ముఖ్యమంత్రి స్టాలిన్ తీమణి దుర్గ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. బ్రహ్మ విద్యాంబికా సమేత శ్వేతారణ్యేశ్వరాలయ ప్రాంగణంలో శివుడి అంశమైన బుధుడికి ప్రత్యేక సన్నిధిలో పూజలు నిర్వహిస్తున్నారు. ఆయనకు ప్రతి ఆదివారం క్షీరాభిషేకంతో ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనవాయితీ. ఆ రీతిలో కార్తిక మాసం మూడో ఆదివారం శివాచార్యుల బృందం నిర్వహించిన ప్రత్యేక పూజలు, క్షీరకలశాల ఊరేగింపులో దుర్గా స్టాలిన్ పాల్గొని భక్తిశ్రద్ధలతో స్వామివారిని సేవించారు. ఆలయ ప్రాంగణంలోని తీర్థకొలను చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఆమెకు ఘన స్వాగతం పలికిన పూజారులు, ఆలయ నిర్వాహకులు ప్రత్యేక పూజల అనంతరం ఆలయ మర్యాదలతో సత్కరించి ప్రసాదాలు పంపిణీ చేశారు.


క్షీరకలశాల ఊరేగింపులో దుర్గాస్టాలిన్

వళ్లువర్‌కోట్టంలో

విదేశీ హాకీ క్రీడాకారుల సందడి


రాతిరథం ముందు డిప్యూటీ సీఎం ఉదయనిధితో విదేశీ హాకీ క్రీడాకారులు

ప్యారీస్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నగరంలో ప్రముఖ పర్యాటక ప్రాంతాలను, చారిత్రాత్మక కట్టడాలను న్యూజిలాండ్‌కు చెందిన క్రీడాకారులు సోమవారం ఆసక్తిగా తిలకించారు. నుంగంబాక్కంలో అద్భుత శిల్పకళా నైపుణ్యంతో నిర్మించిన వళ్లువర్‌కోట్టం ప్రాంగణాన్ని సందర్శించి అక్కడున్న శిల్పసౌందర్యాన్ని వీక్షించారు. తమిళనాడు క్రీడాభివృద్ధి కమిషన్, హాకీ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో చెన్నై, మదురై ప్రాంతాల్లో నిర్వహిస్తున్న 14వ పురుషుల జూనియర్ హాకీ పోటీల్లో న్యూజిల్యాండ్ క్రీడాకారులు పాల్గొంటున్నారు. వీరు పోటీ నిర్వాహకులతో కలిసి సోమవారం నుంగంబాక్కంలో ప్రపంచ ప్రసిద్ధి చెందిన వళ్లువర్‌కోట్టం ప్రాంగణంలోని 106 అడుగుల ఎత్తు రాతిశిల్ప రథాన్ని తిలకించి దాని ముందు డిప్యూటీ సీఎం ఉదయనిధితో కలిసి ఫొటో దిగారు. ఈ కార్యక్రమంలో తమిళనాడు క్రీడాభివృద్ధి సంస్థ మెంబర్ సెక్రటరీ జె.మధుసూధన్ రెడ్డి, ఇంటర్నేషనల్ హాకీ సమ్మేళనం ఛైర్మన్ డత్తో ధాయజ్ ఇక్రం, ఇండియా హాకీ ఫెడరేషన్ ఛైర్మన్ దిలీప్ తర్కీ తదితరులు నగరంలో ప్రసిద్ధి చెందిన పర్యాటక ప్రాంతాలు, హెరిటేజ్ కట్టడాలను సందర్శించి హర్షం వ్యక్తంచేశారు.

నేడు పుదువైకి విజయ్

● పార్టీ శ్రేణులకు 11 నిబంధనలు

చెన్నై, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తమిళగ వెట్రి కళగం (టీవీకే) నాయకుడు విజయ్ మంగళవారం ఉదయం పుదుచ్చేరిలో 'ప్రజలతో భేటీ' పేరుతో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. పుదుచ్చేరి ఉప్పళం ప్రాంతంలో ఉదయం 10.30 గంటలకు జరుగనున్న ఈ సభకు వచ్చే పార్టీ శ్రేణులకు 11 నిబంధనలు విధించారు. ఆ సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న టీవీకే ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ ఈ వివరాలను సోమవారం మధ్యాహ్నం ప్రకటించారు. పుదుచ్చేరి రాష్ట్ర పోలీసుల విధివిధానాల ప్రకారం పుదుచ్చేరికి చెందిన క్యూ ఆర్‌కోడ్‌తో కూడిన ఎంట్రెన్స్ టికెట్లున్న సుమారు 5 వేలమందిని మాత్రమే సభా ప్రాంగణంలోకి అనుమతిస్తామన్నారు. పుదుచ్చేరి సమీపంలో ఉన్న తమిళనాడుకు చెందిన వారెవరూ ఈ సమావేశానికి రాకూడాదనే ఆంక్షలు విధించామన్నారు. గర్భిణులు, చంటి బిడ్డ ఉన్న బాలింతలు, రెండు మూడేళ్లలోపు పిల్లలతో వచ్చే మహిళలు, యువతులను సభా ప్రాంగణంలోకి అనుమతించే ప్రసక్తి లేదని ఆయన స్పష్టం చేశారు. ఇదే విధంగా పార్టీ నేత విజయ్ పుదుచ్చేరి వస్తున్నప్పుడు, సభ ముగించుకుని వెళ్తున్నప్పుడు ఆయన వాహనాన్ని వెంబడించకూడదని, ఈ నిబంధన అందరూ పాటించాలన్నారు. పోలీసుశాఖ నిబంధనల ప్రకారం పార్టీ శ్రేణులు నడుచుకోవాలని, ప్రత్యేకించి ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించకూడదన్నారు సమావేశానికి వచ్చే వారు తమ వాహనాలను పాండి మెరీనా పార్కింగ్, ఓల్డ్ హార్బర్ ప్రాంతం, ఇందిరాగాంధీ స్టేడియం వెనుక ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్రదేశాల్లోనే పార్కింగ్ చేయాలన్నారు. సభా ప్రాంగణం వద్ద ఎలాంటి దూషణలకు, దాడులకు పాల్పడకుండా శాంతి భద్రతలకు భంగం కలిగించకుండా పార్టీ శ్రేణులు క్రమశిక్షణతో వ్యవహరించాలన్నారు. పార్టీ శ్రేణులంతా తమకు ఇచ్చిన బ్యాడ్జీలను ధరించి రావాలన్నారు. హైకోర్టు ఉత్తర్వు ప్రకారం జాతీయ రహదారిలో ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేయకూడదని, స్వాగత తోరణాలు కట్టకూడదన్నారు. సభా ప్రాంగణానికి చేరువగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు భవనాలపైగానీ, చెట్లపై, విద్యుత్‌స్తంభాలపై పార్టీ కార్యకర్తలు నిలిచి అల్లర్లకు పాల్పడకూడదన్నారు. సభా ప్రాంగణం వద్ద అంబులెన్స్‌లు వస్తే వాటికి వెంటనే దారిచ్చేందుకు పార్టీ శ్రేణులు సహకరించాలన్నారు. సభ అనంతరం పార్టీ కార్యకర్తలందరూ క్రమశిక్షణ కలిగిన సైనికుల్లా ఎలాంటి శబ్దాలు చేయకుండా తమ స్వస్థలాలకు బయలుదేరాలని, ఈ ఆంక్షలను అందరూ పాటించి సభను విజయవంతం చేయడానికి సహకరించాలని బుస్సీ ఆనంద్ విజ్ఞప్తి చేశారు.


ఏర్పాట్లను పరిశీలిస్తున్న టీవీకే ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్

సమాచార దర్శిని

రేషన్ దుకాణాల పనివేళల్లో మార్పులు

పెరంబూర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాత్రి వేళల్లో రేషన్ సిబ్బంది ఇంటికి వెళ్లే సమయంలో ఇబ్బందులు పడుతుండడంతో, నగరంలో రేషన్ దుకాణాల పనివేళలు మార్పులు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. నగరంలోని రేషన్ దుకాణాలు ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటలు, మధ్యాహ్నం 3 నుంచి రాత్రి 7 గంటల వరకు పనిచేస్తున్నాయి. ఇతర జిల్లాల్లో, ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పనిచేస్తున్నాయి. నగరంలోని రేషన్ దుకాణాల్లో చెంగల్పట్టు, కాంచీపురం, తిరువళ్లూర్ తదితర జిల్లాలకు చెందిన వారు పనిచేస్తున్నారు. ఉదయం, సాయంత్రం ట్రాఫిక్ రద్దీ కారణంగా, ఉద్యోగులు రేషన్ దుకాణాలకు వచ్చి వెళ్లడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయమై రేషన్ సిబ్బంది విజ్ఞప్తిని పరిశీలించిన ప్రభుత్వం నగరంలోని రేషన్ దుకాణాల పనివేళలు మార్చాలని నిర్ణయించింది. ఈ ప్రకారం, ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు రేషన్ దుకాణాలు పనిచేస్తున్నాయి. అదే సమయంలో, మధ్యాహ్న భోజనం కారణంగా దుకాణాలు 2.30 గంటలు మూసివేస్తుండగా, ఇక నుంచి ఒక గంట తగ్గించారు.

11 వరకు పాఠశాలల్లో భారతియార్ జయంతి వేడుకలు

పెరంబూర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): భారతియార్ జయంతి వేడుకలు ఈ నెల 11వ తేది వరకు నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీచేసింది. దేశవ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో భారతీయ భాషల పండుగ జరుపుకోవాలని కేంద్ర విద్యాశాఖ కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ వేడుకల్లో భారతియార్ జయంతి కూడా కలిపి నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. ఆ ప్రకారం, పాఠశాలల్లో విద్యార్థులకు మాతృభాష, ప్రకృతి, పర్యావరణం, సంస్కృతి, ఆహారపు అలవాట్లు, ఇతర భాషలు తదితర అంశాలపై వివరించడం, వాటి కోసం చర్చించాలని చర్చించడం చేపట్టాలని సూచించింది. అలాగే, భారతియార్‌పై కథలు, నాటక ప్రదర్శన పోటీలు ఈ నెల 11వ తేది వరకు నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వుల్లో తెలియజేసింది.

6 నుంచి నిరవధిక సమ్మె: జాక్టో-జియో

పెరంబూర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయుల డిమాండ్ల సాధనకు జనవరి 6వ తేది నుంచి నిరవధిక సమ్మె చేపట్టాలని జాక్టో-జియో నిర్ణయించింది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయుల జాయింట్ యాక్షన్ కమిటీ (జాక్టో-జియో) ఉన్నత స్థాయి సమావేశం ఆదివారం తిరుచ్చిలో జరిగింది. డీఎంకే ఎన్నికల హామీల్లో ఒకటైన, పాత పింఛన్ విధానం సహా పది డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సమావేశంలో తీర్మానించారు. అలాగే, డిమాండ్ల సాధనకు, ఈ నెల 13న జిల్లా కేంద్రాల్లో నిరాహారదీక్షలు, 15 నుంచి 19వ తేది వరకు తాలూకా స్థాయి ప్రచార సభలు, 27న జిల్లా ప్రధాన కేంద్రాల్లో నిరవధిక సమ్మె సన్నాహక సమావేశం నిర్వహించనున్నారు. అప్పటికి ప్రభుత్వం స్పందించని పక్షంలో జనవరి 6 నుంచి నిరవధిక సమ్మె చేపట్టాలని నిర్ణయించినట్లు జాక్టో-జియో తెలిపింది.

6.34 కోట్ల ఓటర్ల వివరాలు 'ఆన్‌లైన్'

పెరంబూర్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 6.34 కోట్ల ఓటర్ల వివరాలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారు. రాష్ట్రంలో వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి. ఈ క్రమంలో, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) పనులను ఎన్నికల కమిషన్ ప్రారంభించింది. మొదట జాబితాలోని ఓటర్లను గుర్తించే ప్రక్రియ ఈ నెల 11వ తేతో ముగియనుంది. రాష్ట్రంలో 6.41 కోట్ల మంది ఓటర్లుండగా, వారిలో 6.40 కోట్ల మందికి ఫారాలు అందజేశారు. ఆ ప్రకారం, రాష్ట్రంలో 'సర్' పనులు 99.8 శాతం ముగిశాయి. పూర్తిచేసిన 6.34 కోట్ల మంది నుంచి ఫారాలు పొంది, వారి వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసినట్లు ఎన్నికల కమిషన్ తెలిపింది.

దెబ్బతిన్న రోడ్లకు సత్వరం మరమ్మతులు

పెరంబూర్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి) వర్షాలతో దెబ్బతిన్న రోడ్లకు వారంరోజుల్లో మరమ్మతులు చేపట్టాలని రహదారులు, మున్సిపల్ పరిపాలన, గ్రామీణాభివృద్ధి శాఖలకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. రాష్ట్ర రహదారులశాఖ పరిధిలో 65వేల కి.మీ రోడ్లున్నాయి. మున్సిపల్, గ్రామీణాభివృద్ధి శాఖల పరిధిలో ఉన్న రోడ్లను రాష్ట్ర రహదారి శాఖ రోడ్లతో అనుసంధానం చేశారు. నగరంలోని రోడ్లపై మెట్రోరైలు నిర్మాణం, వర్షపు నీటి కాలువల నిర్మాణం, తాగునీటి బోర్డు కొత్త పైపులు వేయడం వంటివి జరుగుతున్నాయి. ఈక్రమంలో, నగరంలో దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులకు రహదారుల శాఖకు రూ.600 కోట్లు మెట్రో రైలు సంస్థ కేటాయించింది. వివిధ జిల్లాల్లో రోడ్లు మర్మమతులు చేయడానికి మున్సిపల్ పరిపాలన, గ్రామీణాభివృద్ధి శాఖలకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించింది. ఈ క్రమంలో, ఇటీవల కురిసిన వర్షాలతో పలు రోడ్లు దెబ్బతిన్నాయి. వర్షాకాలం ముగిసిన తర్వాత జనవరిలో రోడ్లు పూర్తిగా నిర్మించాలని నిర్ణయించిన ప్రభుత్వం, దెబ్బతిన్న రోడ్లకు వారం రోజుల్లో మరమ్మతులు చేపట్టాలని ఉత్తర్వులు జారీచేసింది.

అమ్మవారికుప్పంలో బీజేపీ నేతల సమావేశం

తిరుత్తణి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికలను పురస్కరించుకుని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ సోమవారం ఉదయం తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి సమీపం అమ్మవారికుప్పంలో పర్యటించారు. ఈ సందర్భంగా కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి ప్రభుత్వ పథకాలపై అడిగి తెలుసుకున్నారు. పార్టీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ కిరణ్ నేతృత్వంలో జరిగిన ఈ సమావేశానికి సుమారు 500 మంది హాజరయ్యారు.



సమావేశంలో మాట్లాడుతున్న నయినార్ నాగేంద్రన్, హాజరైన బీజేపీ నాయకులు, కార్యకర్తలు

లైంగిక వేధింపుల ఫిర్యాదుతో మతబోధకుడి తొలగింపు

- చర్చిలో ఇరువర్గాల బాహాబాహీ

పెరంబూర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): లైంగిక వేధింపుల ఫిర్యాదుతో మతబోధకుడిని తొలిగించిన నేపథ్యంలో, ప్రార్థనా సమయంలో చర్చిలో ఇరువర్గాలు బాహాబాహీకి దిగిన ఘటన కలకలం రేపింది. తూత్తుకుడి ఇగ్నేషియర్ పురంలో సెయింట్ ఇగ్నేషియర్ చర్చిలో జేసు నసరేన్ (43) మతబోధకుడిగా వ్యవహరిస్తున్నాడు. చర్చికి వస్తున్న మహిళలను ఆయన లైంగికంగా వేధించేవాడని, రాత్రి పూట అసభ్యకరమైన సందేశాలు పంపేవాడని తెలిసింది. బాధితులు ఈ వ్యవహారంపై తూత్తుకుడి క్యాథలిక్ డయోసెస్ బిషప్ స్టీఫెన్ ఆంతోనీకి ఫిర్యాదు చేశారు. విచారణ జరిపిన ఆయన, ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీంతో బాధితులు పోలీసు శాఖకు, వడపాక్కం పోలీస్ స్టేషన్‌కు ఆన్‌లైన్‌లో ఫిర్యాదులు చేశారు. ఈ విషయమై కేసు నమోదుచేసి, మతబోధకుడిపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ మహిళలు శనివారం పోలీసుస్టేషన్‌ను ముట్టడించారు. అంతలో, జేసు నసరేన్‌ను మతబోధకుడి పదవి నుంచి తొలగిస్తూ ఆర్చ్ డయోసెస్ చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో, ఆదివారం ఉదయం 5 గంటలకు జరగాల్సిన ప్రార్థన, మతబోధకుడు లేని కారణంగా నిర్వహించలేదు. ఆ ప్రాంత ప్రజల విజ్ఞప్తితో, తాత్కాలికంగా మతబోధకుడిని నియమించి ప్రార్థనా కార్యక్రమాలు చేపట్టాలని ఆర్చ్ డయోసెస్ ఆదేశించింది. కొత్తగా నియమితులైన మతబోధకుడు చర్చి లోపలికి ప్రవేశించే సమయంలో జేసు నసరేన్ మద్దతుదారులు అడ్డుకున్నారు. మరోవర్గం, ఆయన ప్రార్థనా కార్యక్రమాలు నిర్వహించాలని కేకలు వేసింది. ఈ కారణంగా ఇరువర్గాలు బాహాబాహీకిదిగాయి. వడపాక్కం పోలీసులు అక్కడకు చేరుకుని ఇరువర్గాలను శాంతింపజేశారు. గాయపడిన ఇరువర్గాలకు చెందిన వారిని తూత్తుకుడి ప్రభుత్వాసుపత్రికి తరలించిన పోలీసులు, విచారిస్తున్నారు.



చర్చిలో పరస్పరదాడులకు పాల్పడుతున్న ఇరువర్గాలు, శాంతింపజేస్తున్న పోలీసులు

గంజాయితో ముగ్గురు సాధువుల అరెస్ట్

పెరంబూర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): చెయ్యారు సమీపంలో గంజాయితో సంచరిస్తున్న ముగ్గురు సాధువులను పోలీసులు అరెస్ట్ చేశారు. తిరువణ్ణామలై జిల్లా చెయ్యారులో ఆదివారం పోలీసులు గస్తీ తిరుగుతున్న సమయంలో ఆ ప్రాంతంలో రుద్రాక్షలు ధరించిన ముగ్గురు సాధువులను పోలీసులు అనుమానించారు. సాధువులైన వెంబాక్కం తాలూకాకు చెందిన ఢిల్లీరాజ్, విరుదు నగర్‌కు చెందిన సురేష్, తిరువణ్ణామలైకు చెందిన మహంత్ వీరేంద్రగిరి బ్యాగులు తనిఖీ చేయగా, 85 గ్రాముల గంజాయి, కల్లు గుర్తించారు. నేపాల్ నుంచి గంజాయిని కొనుగోలు చేసి సొంతానికి వాడుకుంటున్నట్లు, తాగేందుకు కల్లు తీసుకెళ్తున్నట్లు వారు వెల్లడించారు. కొద్దిరోజుల వరకు తిరువణ్ణామలైలో ఉంటూ గిరి ప్రదిక్షణ చేసిన వారు కాంచీపురం ఏకాంబరనాథ ఆలయ కుంభాభిషేకానికి వస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ముగ్గురిని అరెస్ట్ చేసిన పోలీసులు, కోర్టులో హాజరుపరచి జైలుకు తరలించారు.

విద్యార్థిని హఠాత్ మృతి



కృష్ణవేణి (ఫైల్‌ఫొటో)

పెరంబూర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పాఠశాలకు బయల్దేరిన విద్యార్థిని, హఠాత్తుగా మృతిచెందిన ఘటన విషాదానికి దారితీసింది. తెన్‌కాశి జిల్లా ఉడయంపుళి గ్రామానికి చెందిన మురుగన్-శంకరమ్మాళ్ దంపతులకు కృష్ణవేణి అనే కుమార్తె, శివ అనే కుమారుడున్నాడు. కృష్ణవేణి స్థానిక ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. కృష్ణవేణికి గుండె సంబంధిత సమస్యకు చికిత్స పొందుతోంది. ఈ క్రమంలో, సోమవారం ఉదయం కృష్ణవేణి పాఠశాలకు బయల్దేరి పుస్తకాలు బ్యాగుతో ఇంటి నుంచి బయటకు వచ్చింది. ఇంటి గుమ్మం దాటుతుండగా హఠాత్తుగా స్పృహ తప్పి కిందపడిపోయింది. తల్లిదండ్రులు ఆమెను అలంగుళం ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అప్పటికే ఆమె మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

రూ. కోటి విలువైన ఏనుగు దంతాల స్వాధీనం



స్వాధీనం చేసుకున్న ఏనుగు దంతాలు

పెరంబూర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): శ్రీలంకకు తరలించేందుకు యత్నించిన రూ.కోటి విలువైన ఏనుగు దంతాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రామనాథపురం నుంచి సముద్ర మార్గం గుండా శ్రీలంకకు ఏనుగు దంతాలను అక్రమంగా తరలిస్తున్నారని పోలీసులకు సమాచారం అందింది. దీంతో కీలకశాఖ మెరీన్ పోలీసులు ఆ ప్రాంతాల్లోని సముద్రతీరాల్లో గస్తీ చేపట్టి, రెండు ఏనుగు దంతాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంలో ముగ్గురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు, ఏనుగు దంతాలు ఎక్కడ నుంచి తీసుకొచ్చారు అనే విషయమై విచారిస్తున్నారు.

మంత్రి కేఎన్ నెహ్రూపై కేసు నమోదు చేయండి

- డీజీపీకి రెండోసారి లేఖరాసిన ఈడీ



మంత్రి కేఎన్ నెహ్రూ

ప్యారీస్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వ పట్టణాభివృద్ధి, నీటిపారుదలశాఖ మంత్రి కేఎన్.నెహ్రూపై రూ.1020కోట్ల అవినీతికి సంబంధించి కేసు నమోదు చేసి విచారణ జరపాల్సిందిగా రాష్ట్ర డీజీపీకి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) రెండోసారి లేఖరాసింది. పట్టణాభివృద్ధి, నీటిపారుదలశాఖలో 2,528 మంది ఇంజనీర్లు, అధికారుల నియామకం, టెండర్‌లో అవినీతికి పాల్పడ్డారని ఆ శాఖమంత్రి కేఎన్.నెహ్రూపై ఈడీ ఆరోపణలు చేసింది. తనకున్న అధికారంతో పెద్దమొత్తంలో లంచం తీసుకుని ఉద్యోగావకాశాలు కల్పించారని, ఈ అవినీతికి ఆధారాలు కూడా ఉన్నాయని ఈడీ గతంలో ప్రకటించింది. మంత్రి అవినీతిపై కేసు నమోదు చేసి విచారణ జరపాలంటూ అక్టోబరు 27న డీజీపీకి రాసిన లేఖపై ఇప్పటివరకు పోలీసులు కేసు నమోదు చేయలేదని తెలిసింది. ఈ నేపథ్యంలో, ఈడీ రెండోసారి సోమవారం డీజీపీకి లేఖరాయడం గమనార్హం.

ఈడీ లేఖలో ఏమీలేదు: మంత్రి కేఎన్ నెహ్రూ

తనకు వ్యతిరేకంగా కేసు నమోదుచేసి విచారణ జరపాలని డీజీపీకి ఈడీ రాసిన లేఖలో ఏమీలేదని, ముమ్మాటికి ఇది రాజకీయ కక్షసాధింపేనని మంత్రి కేఎన్.నెహ్రూ పేర్కొన్నారు. ఈడీ లేఖపై స్పందించిన ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఈడీ రెండోసారి రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీకి లేఖ రాసిందని, ఆ వ్యవహారాన్ని తాను చూసుకుంటానని, ఇందులో ఆందోళనచెందాల్సిన అవసరంలేదని ధీమావ్యక్తం చేశారు.

27 నుంచి పక్షుల గణన

పెరంబూర్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 2026వ సంవత్సరానికి సమగ్ర పక్షుల గణన ఈ నెల 27వ తేది నుంచి ప్రారంభం కానుంది. ఈ విషయమై అటవీ శాఖ అధికారులు మాట్లాడుతూ... రాష్ట్రంలో ప్రతి ఏడాది జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల్లో సమగ్ర పక్షుల గణన చేపడుతున్నామన్నారు. ఆ ప్రకారం, ఈ ఏడాది ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెలల్లో పక్షుల గణన జరిగింది. ఈ క్రమంలో 2026వ సంవత్సరానికి సంబంధించిన గణన, ఈ నెల 27, 28 తేదీల్లో నీటి వనరుల్లో నిర్వహించాలని నిర్ణయించామనిఅధికారులు తెలిపారు.

దీపాలు వెలిగించే బల్లపై చెలరేగిన మంటలు

తిరుత్తణి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లాలోని తిరుత్తణి మురుగన్ ఆలయ ప్రాంగణంలో భక్తులు వెలిగించే దీపాల బల్లపై అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. రాజగోపురం ముందున్న దీపాల చెక్కబల్లపై ఆలయానికి వచ్చే భక్తులు దీపాలు వెలిగిస్తారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం కార్తీక పూజల్లో భాగంగా భక్తులు వెలిగించిన దీపాల నుంచి చెక్కబల్లకు నిప్పు అంటుకుంది. ఆ మంటలు కాస్త ఆ ప్రాంతంలోని ఇతర చెక్కబల్లలకు వ్యాపించడంతో భక్తులు దూరంగా పారిపోయారు. విషయం తెలుసుకున్న ఆలయ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని నీరుపోసి మంటలను అదుపుచేశారు. చెక్కబల్లలపై దీపాలు వెలిగించడమే ఈ ప్రమాదానికి కారణమని భక్తులు తెలిపారు.



మండుతున్న చెక్కబల్లలు

స్టాలిన్ ప్రభుత్వం అమలు చేసిన హామీలు 13 శాతమే

- పీఎంకే అధ్యక్షుడు అన్బుమణి



మీడియాతో మాట్లాడుతున్న అన్బుమణి

ప్యారీస్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గత అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే ఇచ్చిన 505 హామీల్లో కేవలం 13 శాతం హామీలను మాత్రమే నెరవేర్చి ప్రజలను మోసం చేసిందని పీఎంకే అధ్యక్షుడు డాక్టర్ అన్బుమణి ఆరోపించారు. ధర్మపురిలో సోమవారం జరిగిన పీఎంకే జిల్లాస్థాయి నేతల సమావేశంలో పాల్గొన్న సందర్భంగా అన్బుమణి మీడియాతో మాట్లాడారు. ధర్మపురి జిల్లాలో రోడ్లు, తాగునీరు, వైద్యం, విద్య, ఉద్యోగావకాశాలు తదితర రంగాలకు సంబంధించిన సమస్యలతో ప్రజలు సతమతమవుతున్నారని, వీటి గురించి ఎంపీ హోదాలో తాను పలుమార్లు జిల్లా కలెక్టర్, ప్రభుత్వానికి వినతిపత్రం సమర్పించినా ఎలాంటి చర్యలు లేవని ఆరోపించారు. సిప్కాట్ పారిశ్రామికవాడ తీసుకొస్తామని ఇచ్చిన హామీ ఏమైందో స్టాలిన్ ప్రభుత్వం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలోని పట్టణాభివృద్ధిశాఖలో భారీస్థాయిలో అవినీతి జరిగిందని ఆరోపిస్తూ 232 పేజీల నివేదికను డీజీపీకి ఈడీ సమర్పించినా విచారణ జరపడానికి డీజీపీ సాహసించకపోవడం సిగ్గుచేటన్నారు.

- అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి వ్యవహారం

ఈపీఎస్‌కు వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో పిటిషన్

ప్యారీస్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి పదవిలో కొనసాగుతున్న ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్)కి వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో సోమవారం అపీలు పిటిషన్ దాఖలైంది. అన్నాడీఎంకే సీనియర్ సభ్యులు పార్టీ ప్రధాన కార్యదర్శిని ప్రత్యక్షంగా ఓటేసి ఎన్నుకోవడానికి బదులుగా, 2022వ సంవత్సరం పార్టీ సర్వసభ్య మండలి సమావేశమై ఈపీఎస్‌ను ప్రధాన కార్యదర్శిగా ఎంపిక చేయడం పార్టీ అజెండాకు విరుద్ధమని ఆరోపిస్తూ దిండుగల్‌కు చెందిన సూర్యమూర్తి చెన్నై నాలుగో సిటీ సివిల్ కోర్టులో పిటిషన్ వేశారు. ఈ నేపథ్యంలో, తనకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్ తోసిపుచ్చాలని కోరుతూ ఈపీఎస్ తరుపున అదే కోర్టులో దాఖలైన పిటిషన్‌ను న్యాయస్థానం తోసిపుచ్చింది. ఈ ఉత్తర్వులను వ్యతిరేకిస్తూ ఈపీఎస్ మద్రాస్ హైకోర్టులో పిటిషన్ వేయగా, విచారణ జరిపిన హైకోర్టు న్యాయమూర్తి బాలాజీ సమక్షంలో ఇరుతరుపు న్యాయవాదులు హాజరై వాదించారు. అన్నాడీఎంకే సభ్యుడుకాని పిటిషనర్‌కు పార్టీ వ్యవహారాలను ప్రశ్నించే అర్హతలేదన్న ఈపీఎస్ తరుపు వాదన అంగీకరించిన న్యాయస్థానం సూర్యమూర్తి పిటిషన్‌ను తోసిపుచ్చింది. ఇదిలా వుండగా, మద్రాస్ హైకోర్టు ఉత్తర్వులకు వ్యతిరేకంగా సూర్యమూర్తి తరుపున సుప్రీంకోర్టులో దాఖలు చేసిన అపీలు పిటిషన్ త్వరలో విచారణకు రానుంది.

ఆలయ భూముల కబ్జా కేసు

- కేంద్ర మాజీమంత్రి అళగిరి అప్పీలు పిటిషన్ తోసివేత



ఎంకే అళగిరి

ప్యారీస్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆలయ భూముల కబ్జా కేసు నుండి తనకు విముక్తి కల్పించాలని కోరుతూ కేంద్ర మాజీమంత్రి, సీఎం స్టాలిన్ సోదరుడు ఎంకే అళగిరి దాఖలుచేసిన అపీలు పిటిషన్‌ను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. మదురై శివకోటలో ఆలయానికి సొంతమైన నాలుగు సెంట్ల భూమి కబ్జా చేశారని అళగిరి సహా ఏడుగురిపై ఆర్థిక నేరవిభాగం పోలీసులు కేసు నమోదుచేశారు. ఈకేసుపై విచారణ జరిపిన మద్రాస్ హైకోర్టు, ఆరోపణలు ఎదుర్కొంటున్న ముద్దాయిలు విచారణకుహాజరుకావాలని ఉత్తర్వులు జారీచేసింది. ఈఉత్తర్వులను వ్యతిరేకిస్తూ అళగిరి సుప్రీంకోర్టులో దాఖలు చేసిన అపీలు పిటిషన్ సోమవారం విచారణకు రాగా, పరిశీలించిన న్యాయస్థానం అపీలును తోసిపుచ్చుతూ ఉత్తర్వులు జారీచేసింది. హైకోర్టులో పెండింగులో ఉన్న ఈ కేసు విచారణకు ఎందుకు హాజరుకాలేదని అళగిరి వర్గాన్ని అత్యున్నత న్యాయస్థాన ధర్మాసనం ప్రశ్నించింది.

7.35 టీఎంసీల నీరు విడుదల చేయాలి

- కర్ణాటక సర్కార్‌కు కావేరి మండలి ఆదేశం

అడయార్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తమిళనాడుకు డిసెంబరులో ఇవ్వాల్సిన 7.35 టీఎంసీల నీరు విడుదల చేయాలని కర్ణాటక ప్రభుత్వానికి కావేరి నిర్వహణ మండలి ఉత్తర్వులు జారీచేసింది. కావేరి నిర్వహణ మండలి 46వ సమావేశం ఢిల్లీలో సోమవారం జరిగింది. మండలి అధ్యక్షుడు ఎస్‌కే హల్దర్ నేతృత్వంలో జరిగిన ఈ సమావేశంలో, తమిళనాడు, కర్ణాటక, కేరళ, పుదుచ్చేరి రాష్ట్రాల అధికారులు పాల్గొన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు తమిళనాడుకు అందించాల్సిన కావేరి జలాల వ్యవహారంపై చర్చించారు. అలాగే, కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం నిర్మించాలనుకుంటున్న మెకెదాటు ఆనకట్టపై కూడా సమావేశంలో వాడీగా వేడిగా చర్చలు జరిగినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో, కావేరి నుంచి తమిళనాడుకు డిసెంబరుకు వదలాల్సిన 7.35 టీఎంసీల నీటిని విడుదల చేయాలని కర్ణాటక ప్రభుత్వానికి కావేరి నిర్వహణ మండలి ఉత్తర్వులు జారీచేసింది.

రాష్ట్రపతికి సిద్ధ వైద్య విశ్వవిద్యాలయం బిల్లు

అడయార్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): సిద్ధ వైద్య విశ్వవిద్యాలయానికి సంబంధించిన బిల్లును గవర్నర్ ఆర్‌ఎన్ రవి రాష్ట్రపతి పరిశీలనకు పంపారు. రాష్ట్రంలో సిద్ధ వైద్య విశ్వవిద్యాలయం ఏర్పాటుకు సంబంధించిన బిల్లు 2022 ఏప్రిల్‌లో శాసనసభలో ఆమోదించి, గవర్నర్ ఆమోదానికి పంపారు. గవర్నర్ బిల్లులో నాలుగు మార్పులు కోరిన అనంతరం, అదే ఏడాది అక్టోబరులో బిల్లును తిరిగి శాసనసభలో ఆమోదించారు. అదేసమయంలో, సిద్ధ వైద్య విశ్వవిద్యాలయానికి సంబంధించి గవర్నర్ వ్యాఖ్యలు నిరాకరిస్తూ శాసనసభలో తీర్మానంచేశారు. మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఈ బిల్లును ప్రస్తుతం రాష్ట్రపతి పరిశీలనకు గవర్నర్ పంపినట్లు సమాచారం.

నష్టపరిహారం కోరుతూ రోడ్డెక్కిన రైతులు

ప్యారీస్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): భారీవర్షాలకు నీటమునిగిన పంటలకు నష్టపరిహారం డిమాండ్ చేస్తూ నాగపట్నం జిల్లా తలైన్యాయార్‌కు చెందిన రైతులు సోమవారం రాస్తారోకో నిర్వహించారు. సుమారు 500 మందికి పైగా రైతులు ఈస్ట్‌కోస్ట్ రోడ్డులో రాస్తారోకో చేయడంతో ఇరు వైపుల వాహనాల రాకపోకలకు తీవ్రఅంతరాయం ఏర్పడింది. జిల్లాలో తలైన్యాయార్ పంచాయతీ పరిధిలో ఉన్న అరుందవపురం ఆయమూరు, మళ్లత్తేరు, మల్లాచ్చిచ్చేరి, కడనానది సహా 50కి పైగా గ్రామాల్లో వందలాది ఎకరాల్లో కోతకు సిద్ధంగా ఉన్న వరి నీటమునిగింది. పంట నష్టాన్ని అంచనా వేసేందుకు ఇప్పటివరకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల తరుపున ఒక్క అధికారి కూడా రాకపోవడంతో నష్టపోయిన తమకు పరిహారం అందజేయాలని కోరుతూ అన్నదాతలు రోడ్డెక్కి నినాదాలు చేశారు.



రోడ్డుపై బైఠాయించి రైతుల నిరసన

ఎన్‌టీకే అధికారంలోకి వస్తే బీచ్‌లో నేతల సమాధుల తొలగింపు: సీమాన్



బహిరంగ సభలో మాట్లాడుతున్న సీమాన్

ప్యారీస్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): 'మేము అధికారంలోకి వస్తే మెరీనా బీచ్‌లోని మాజీముఖ్యమంత్రులు అన్నాదురై, ఎంజీఆర్, కరుణానిధి, జయలలితల సమాధులను తొలగిస్తాం' అంటూ నామ్ తమిళర్ కట్చి (ఎన్‌టీకే) ఆర్గనైజర్ సీమాన్ విమర్శనాత్మక వ్యాఖ్యలు చేశారు. కళ్లకురిచ్చి జిల్లా ఉళుందూర్‌పేటలో ఆదివారం రాత్రి జరిగిన ఎన్‌టీకే బహిరంగ సభలో సీమాన్ మాట్లాడారు. వచ్చే ఏడాది జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో తాము గెలిచి ప్రభుత్వం ఏర్పాటు చేస్తే తొలి సంతకం మెరీనా బీచ్‌లో ఉన్న సమాధులను తొలగించడమేనని తెలిపారు. అంతేకాకుండా రాష్ట్రంలో రాజకీయాలు, ప్రభుత్వ పదవుల్లో ఒకే కుటుంబానికి చెందిన వ్యక్తులే ఉన్నారని, ఈ సంస్కృతిని రూపుమాపడమే తమ పార్టీ ఏకైక లక్ష్యమన్నారు. రాష్ట్రంలో కులగణన చేపట్టడంలో అధికార వర్గాలు ఎందుకు వెనక్కి తగ్గుతున్నాయో అర్థంకావడం లేదన్నారు. అనంతరం కళ్లకురిచ్చి, విల్లుపురం జిల్లాల్లో ఎన్‌టీకే తరుపున అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయనున్న అభ్యర్థులను సీమాన్ పరిచయం చేశారు.

తిరుప్పరంకుండ్రం వ్యవహారంలో ప్రభుత్వ వైఖరి అభినందనీయం

- నటి రోహిణి



పెరంబూర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తిరుప్పరంకుండ్రం వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వం దృఢమైన వైఖరిని స్వాగతిస్తున్నట్లు నటి రోహిణి తెలిపారు. నగరంలో తమిళనాడు ప్రగతిశీల రచయితలు, కళాకారుల సమావేశం ఆదివారం జరిగింది. సమావేశంలో పాల్గొన్న రోహిణి మాట్లాడుతూ... భారత రాజకీయ ప్రజాస్వామ్యం కేంద్రప్రభుత్వం నుంచి తీవ్రమైన ముప్పు ఎదుర్కొంటుందన్నారు. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో, మతతత్వాన్ని సమర్థించే పార్టీలు, వారికి మద్దతిస్తున్న వారిని ఓడించాలన్నారు. తిరుప్పరంకుండ్రం వ్యవహారంలో ప్రజల మధ్య మతాల చిచ్చు పెట్టి రాబోయే ఎన్నికల్లో లబ్ధిపొందాలని మతోన్మాతపార్టీలు చర్యలు చేపట్టాయన్నారు. తిరుప్పరంకుండ్రం వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న దృఢమైన వైఖరిని స్వాగతిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో లౌకిక శక్తులకు మద్దతు ఇచ్చి, మత్మోనాద శక్తులకు గుణపాఠం నేర్పాలని ఆమె ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

బెదిరింపులకు భయపడేది లేదు!

- డీఎంకే అధికార ప్రతినిధి ఆర్ఎస్ భారతి

అడయార్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): బీజేపీ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వ బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదని డీఎంకే అధికార ప్రతినిధి ఆర్ఎస్ భారతి స్పష్టం చేశారు. నగరంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.... అసెంబ్లీ ఎన్నికల గడువు సమీపిస్తున్న తరుణంలో ఈడీ, సీబీఐ, ఎన్నికల కమిషన్‌లను గుప్పెట్లో ఉంచుకుని డీఎంకే మంత్రులపై అబద్ధపు కేసులు బనాయించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైందన్నారు. అందువల్ల ఈడీ, సీబీఐలు ఎలాంటి విచారణలు చేపట్టినా భయం లేదన్నారు. ఎడప్పాడి పళనిస్వామి బంధువుల ఇంట్లో ఈడీ సోదాలు చేసిన సమయంలో, మొఖం దాచుకుని ఢిల్లీ వెళ్లింది పళనిస్వామి అని, మమ్మల్ని విమర్శించేందుకు ఆయనకు అర్హత లేదన్నారు. బీజేపీ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం ఎలాంటి ఒత్తిళ్లు చేసిన ధైర్యంగా ఎదుర్కొంటామని ఆర్ఎస్ భారతి స్పష్టం చేశారు.

రూ.18 కోట్ల జీఎస్టీ బకాయి చెల్లించాలని బిర్యానీ మాస్టర్‌కు నోటీసు

అడయార్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): బిర్యానీ మాస్టర్ రూ.18 కోట్ల జీఎస్టీ బకాయి నోటీసు రావడంతో తిరుపత్తూర్ జిల్లాలో కలకలం రేపింది. పాలన్‌కుప్పం దురైస్వామి జంక్షన్‌కు చెందిన అమీర్ బాషా (33) బిర్యానీ మాస్టర్‌కు వివాహమై ఇద్దరు పిల్లలున్నారు. కొద్ది నెలల క్రితం ఆదాయపు పన్ను శాఖ నుంచి ఆయనకు ఓ లేఖ అందింది. అందులో, అమీర్ బాషా చెన్నైలో 'అమీర్ ట్రేడింగ్ కో' అనే సంస్థ నడుపుతున్నట్లు, ఆ సంస్థ చెల్లించాల్సిన రూ.18 కోట్ల జీఎస్టీ బకాయిలు చెల్లించాలని లేఖలో ఉంది. దీంతో దిగ్భ్రాంతి చెందిన అమీర్, తిరుపత్తూర్ ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా అమీర్ మాట్లాడుతూ... తిరుపత్తూర్‌లోని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకులో మాత్రమే తనకు ఖాతా ఉందని, ఆ పాన్ కార్డు ఉపయోగించి ఎవరైనా ఈ మోసానికి పాల్పడి ఉంటారన్నారు. ఈ వ్యవహారంపై విచారణ చేపట్టి, ఈ మోసాలకు పాల్పడే వారిపై చర్యలు చేపట్టాలని ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లు అమీర్ బాషా తెలిపారు.

పాత పింఛన్ పథకం కోసం టీచర్ల ధర్నా

- వెయ్యి మంది ఉపాధ్యాయుల అరెస్టు

చెన్నై, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పాత పింఛన్ పథకాన్ని అమలు చేయాలని కోరుతూ ఎగ్మూరు ఎల్డీ రోడ్డు రాష్ట్ర ప్రాథమిక విద్యా శాఖ ఉపాధ్యాయుల సంఘాల సమాఖ్య సంయుక్త కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు సోమవారం ఉదయం ధర్నా నిర్వహించారు. ఆ తర్వాత నుంగంబాక్కంలో డీపీఐ ఆఫీసును ముట్టడించేందుకుగాను ర్యాలీ నిర్వహించేందుకు ప్రయత్నించారు. పోలీసులు వారి ప్రయత్నాలను అడ్డుకున్నారు. ఉపాధ్యాయులందరూ రోడ్డుపై బైఠాయించడంతో పోలీసులు వారిని అరెస్టు చేసి వ్యాన్లలో తరలించారు. కమిటీ సమన్వయకర్త విన్సెంట్ పాల్‌రాజ్, దాస్ శేఖర్, రషీద్ తదితర నాయకులు ఆందోళనకు నాయకత్వం వహించారు. ఆందోళనలో పాల్గొన్న సుమారు వెయ్యిమంది ఉపాధ్యాయులను అరెస్టు చేశారు.

మా పార్టీకి కేటాయించే గుర్తును చూసి అందరూ ఆశ్చర్యపోతారు

- సెంగోట్టయ్యన్

చెన్నై, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): తమిళగ వెట్రి కళగం (టీవీకే)కు కేంద్ర ఎన్నికల సంఘం కేటాయించనున్న చిహ్నాన్ని చూసి అందరూ ఆశ్చర్యపోతారని ఆ పార్టీ నిర్వాహక కమిటీ సమన్వయకర్త, మాజీ మంత్రి కేఏ సెంగోట్టయ్యన్ తెలిపారు. ఈరోడ్ జిల్లా నంబియూరు ఎంజీఆర్‌నగర్‌లో సోమవారం ఉదయం జానపద కళాకారులు కొందరు ఆయన్ని కలుసుకున్నారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీవీకే సభలకు అనుమతించడంలో పోలీసులు పక్షపాత వైఖరిని అవలంబిస్తున్నారని, ప్రస్తుత ప్రభుత్వంతమ పార్టీ సభలకు అనుమతివ్వడం లేదన్నారు. అన్నాడీఎంకే నుండి డిస్మిస్ అయ్యాక తన రాజకీయ భవిష్యత్ ఇక అంధకారమేనని అందరూ అనుకున్నారని, విజయ్ నేతృత్వంలోని టీవీకే లో చేరిన తర్వాత రాష్ట్రమంతటా తనకు ప్రజాదరణ పెరిగిందన్నారు. శాసనసభ ఎన్నికల్లో టీవీకేని గెలిపించి ఆ పార్టీ అధికారంలోకి వచ్చేంతవరకూ నిద్రపోనని సెంగొట్టయ్యన్ శపథం చేశారు.

క్యాన్సర్ రోగులకు సహాయాల పంపిణీ



సహాయాలు పంపిణీ చేస్తున్న కె.శరవణన్ తదితరులు

వేలూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాంచీపురంలోని అన్నా క్యాన్సర్ ఆస్పత్రి రోగులకు రాణిపేట జిల్లా ఏపీజే ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం సహాయాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా రాణిపేట జిల్లా వాణిజ్య మండలి అధ్యక్షుడు పొన్ కె.శరవణన్ పాల్గొని రోగులకు దుప్పట్లు, బిస్కెట్లతో పాటు పలు సంక్షేమ సహాయాలు అందజేశారు. ఫౌండేషన్ అధ్యక్షుడు గోపి, డాక్టర్ శివగామి, తంగపాండియన్ తదితరులు పాల్గొన్నారు.



కొత్త సినిమా ప్రారంభోత్సవ దృశ్యం

జ్యోతిక నిర్మాతగా మరో నిర్మాణ కంపెనీ

ప్రముఖ హీరో సూర్య సతీమణి, నటి జ్యోతిక నిర్మాతగా మరో నిర్మాణ కంపెనీ ప్రారంభమైంది. ఈ నిర్మాణ సంస్థ సూర్య హీరోగా నటించే 47వ చిత్రాన్ని తెరకెక్కించనుంది. వాస్తవానికి సూర్య - జ్యోతిక దంపతులకు '2డీ ఎంటర్‌టైన్మెంట్స్' పేరుతో ఓ సంస్థ ఉంది. ఈ బ్యానరుపై 'పసంగ 2', '24', 'మగలీర్ మట్టుం', 'కడైకుట్టి సింగర్', 'ఉరియడి-2', 'జాక్‌పాట్', 'పొన్‌మగల్‌వందాల్', 'సూరరై పోట్రు', 'రామేఆండాలుం రావణే ఆండాలుం', 'ఉడన్ పిరప్పే', 'జైభీమ్', 'ఓ మై గాడ్', 'విరుమన్', 'మెయ్యళగన్', 'రెట్రో' వంటి చిత్రాలను నిర్మించారు. వీటిలో 'సూరరైపోట్రు', 'జైభీమ్' చిత్రాలు పలు అవార్డులను సొంతం చేసుకున్నాయి. ఈనేపథ్యంలో జ్యోతిక నిర్మాతగా 'శగరమ్' అనే పేరుతో మరో నిర్మాణ కంపెనీ ప్రారంభించడం ఇపుడు కోలీవుడ్‌లో చర్చనీయాంశంగా మారింది.

11నుంచి చెన్నై అంతర్జాతీయ చిత్రోత్సవాలు

- 12 తమిళ చిత్రాల ఎంపిక

ఈ నెల 11వ తేదీ నుంచి చెన్నై ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ప్రారంభంకానుంది. ఈ నెల 18 వరకు జరిగే ఈ చిత్రోత్సవాలకు 12 తమిళ చిత్రాలను ఎంపిక చేశారు. ఈ వేడుకల ముగింపు కార్యక్రమంలో మొత్తం 13అవార్డులు ప్రదానం చేస్తారు. 51 దేశాలు, 27 భాషలకు చెందిన 122 చిత్రాలను ప్రదర్శించనున్నారు. తమిళం నుంచి 'అలంగు', 'వేంబు', 'మాయకూత్తు', 'మరుదం', 'కాదల్ ఎన్పదు పొదు ఉడమై', 'టూరిస్ట్ ఫ్యామిలీ', '3 బీహెచ్‌కే', 'పెడిమణ్' తదితర చిత్రాలున్నాయి. ప్రారంభచిత్రంగా 'ఈగల్ ఆఫ్ ది రిపబ్లిక్', ముగింపు చిత్రంగా 'ఈఎన్-47' ఎంపిక చేశారు. అలాగే, 2026 ఆస్కార్ అవార్డు కోసం నామినేట్ అయిన 14 చిత్రాలు, 2025లో కేన్స్ అవార్డులు గెలుచుకున్న ఆరు చిత్రాలు, బెర్లిన్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో అవార్డులు పొందిన మూడు చిత్రాలు కూడా ఉన్నాయి. చెన్నై ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో తొలిసారి జార్జియా, ఫిన్‌లాండ్, ఫిలిప్పీన్స్, జోర్డాన్, మియన్మార్, నేపాల్, మోంటెనెగ్రో, సెయింట్ హెలీనా దేశాలకు చెందిన చిత్రాలను ఎంపికచేశారు. పీవీఆర్ ఐనాక్స్ సత్యం, పీవీఆర్ ఐనాక్స్ సిటీ సెంటర్ థియేటర్లలో ఈ చిత్రాలను సాయంత్రం 6 గంటలకు ప్రదర్శించనున్నారు. తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో ఇండో సినీ అప్రీసియేషన్ ఫౌండేషన్, ఎన్ఎఫ్‌డీసీ సంయుక్తంగా నిర్వహించనున్నారు.

చిత్రజ్యోతి



మీడియా సమావేశంలో నిర్వాహకులు



'సిగ్మా'లో కేథరిన్ స్పెషల్ సాంగ్

బాలీవుడ్ నటి కేథరిన్ ఓ తమిళ చిత్రంలో స్పెషల్ సాంగ్ చేయనున్నట్టు సమాచారం. అగ్ర హీరో విజయ్ కుమారుడు జేసన్ విజయ్ దర్శకుడిగా పరిచయమవుతూ రూపొందిస్తున్న 'సిగ్మా' చిత్రం సందీప్ కిషన్ హీరోగా లైకా ప్రొడక్షన్స్ నిర్మిస్తోంది. తమిళం, తెలుగు భాషల్లో ఏకకాలంలో రూపుదిద్దుకుంటున్న ఈ మూవీలోని ఓ ప్రత్యేక గీతంలో కేథరిన్ థ్రెసా నటించేందుకు సమ్మతించినట్టు కోలీవుడ్ వర్గాల సమాచారం. ఇప్పటికే తెలుగు, హిందీ భాషల్లో పలు చిత్రాల్లో నటించిన కేథరిన్... 'సిగ్మా'లో ఐటమ్ సాంగ్‌లో నర్తిస్తున్నారే వార్తలు వినిపిస్తున్నాయి.

15 ఏళ్ల పోరాట ఫలితం 'మహాసేన' : ఉదయ్ ప్రకాష్



తమిళ చిత్రపరిశ్రమలో తన ప్రతిభ నిరూపించుకునేందుకు 15 ఏళ్ళుగా పోరాటం చేస్తున్న వర్ధమాన సంగీత దర్శకుడు ఉదయ్ ప్రకాష్ ఈ కృషి ఫలితంగా ఆయన సంగీతం సమకూర్చిన 'మహాసేన' మూవీ ఈ నెల 12న విడుదలకానుంది. ఈ సందర్భంగా ఉదయ్ ప్రకాష్ మీడియాతో మాట్లాడుతూ, 'చిన్నతనం నుంచే సంగీతం అంటే అమితమైన ప్రాణం. అందుకే రియాలిటీ షో గాయకుడిగా, గేయరచయితగా, నేపథ్యగాయకుడిగా, సంగీత దర్శకుడిగా వచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటున్నాను. తద్వారా నాలోని ప్రతిభ నిరూపించుకునేందుకు శాయశక్తులా పోరాటం చేస్తున్నాను. అడయార్ మ్యూజిక్ కాలేజీలో చదువుకున్నాను. నన్ను ఉన్నతస్థాయిలో చూసేందుకు నా తల్లి ఒంటరిపోరాటం చేస్తూ, నన్ను ఎంతగానో ప్రోత్సహిస్తున్నారు. ఇపుడు నా తల్లితో పాటు నా కల కూడా ఫలించే సమయం ఆసన్నమైంది. నేను తొలిసారి సంగీత దర్శకత్వం వహించిన 'మహాసేన' మూవీ ఈ నెల 12వ తేదీన థియేటర్లలో విడుదలవుతోంది. ఇది నా కెరీర్‌లో ఓ మైలురాయి. సినీ ప్రేక్షకులు, అభిమానులు, మీడియా మిత్రులు, దర్శక నిర్మాతల సహకారంతో మరింత ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్న లక్ష్యంతో ప్రయాణిస్తాను' అని పేర్కొన్నారు.

రూ.98.92 కోట్లతో చేపల రేవులు, భవనాలు

- ప్రారంభించిన సీఎం స్టాలిన్



సచివాలయం నుంచి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా పునర్నిర్మించిన చేపల రేవులను ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి

చెన్నై, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మత్స్యసంపద, మత్స్యకారుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రూ.98.92 కోట్లతో నిర్మించిన, ఆధునీకరించిన చేపలరేవులను, ఫిష్ ల్యాండింగ్ ప్లాట్‌ఫామ్, కొత్త ఫిష్ సీడ్ ఫామ్‌ను ముఖ్యమంత్రి స్టాలిన్ సోమవారం ప్రారంభించారు. చెన్నై సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ చేపలరేవులు, ఫిష్ ల్యాండింగ్ ప్లాట్‌ఫామ్ తదితర భవనాలకు సీఎం ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, మత్స్యశాఖ మంత్రి అనితా ఆర్ రాధాకృష్ణన్, మత్స్య శాఖాభివృద్ధి సంస్థ అధ్యక్షులు ఎన్.గౌతమన్, రాష్ట్ర మత్స్యకారుల సంక్షేమ బోర్డు అధ్యక్షులు ఎ.జోసెఫ్ స్టాలిన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్.మురుగానందనం, మత్స్య సంపద, మత్స్యకారుల సంక్షేమ శాఖ కార్యదర్శి డాక్టర్ ఎన్.సుబ్బయ్యన్, సంచాలకులు కేవీ మురళీధరన్ తదితరులు పాల్గొన్నారు.

23 మినీ స్పోర్ట్స్ స్టేడియంల ప్రారంభం: రాష్ట్ర యువజన సంక్షేమం, క్రీడాభివృద్ధి శాఖల ఆధ్వర్యంలో జరిగిన మరో కార్యక్రమంలో 23 నియోజకవర్గాల్లో నిర్మించిన మినీ స్పోర్ట్స్ స్టేడియంలను కూడా స్టాలిన్ ప్రారంభించారు. 2021 -22 వార్షిక బడ్జెట్‌ను దాఖలు చేసిన సందర్భంగా క్రీడా సదుపాయాలు లేని నియోజకవర్గాల్లో తలా రూ.3 కోట్లతో మినీ స్పోర్ట్స్ స్టేడియంలు నిర్మించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఆ మేరకు రాష్ట్రమంతటా క్రీడా మైదానాలు లేని శాసనసభ నియోజకవర్గాల్లో మినీ స్టేడియంలను నిర్మిస్తున్నారు. ఈ స్టేడియంలలో అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, వాలీబాల్, కబడ్డీ తదితర పోటీలు నిర్వహించేందుకు వీలుందని స్టాలిన్ తెలిపారు. ఇదే విధంగా మరో 23 శాసనసభ నియోజకవర్గాల్లో నిర్మించనున్న మినీ స్టేడియంలకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో క్రీడాశాఖ నిర్వర్తిస్తున్న ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, మంత్రులు అన్బిల్ మహేష్, టీఆర్బీ రాజా, రాష్ట్ర యువజన సంక్షేమం, క్రీడాభివృద్ధి శాఖ అదనపు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అతుల్యామిశ్రా, రాష్ట్ర క్రీడాభివృద్ధి సంస్థ మెంబర్ సెక్రటరీ జే మేఘనాథ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుంత తవ్వుతుండగా
మురుగన్ విగ్రహం లభ్యం



లభ్యమైన విగ్రహం


పెరంబూర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఇల్లు నిర్మించేందుకు గుంత తవ్వుతుండగా, మురుగన్ కాంస్య విగ్రహం లభ్యమైంది. ఈ విషయం తెలుసుకున్న స్థానికులు అక్కడకు చేరుకుని విగ్రహానికి హారతులిచ్చి పూజలు చేశారు. తిరుపత్తూర్ జిల్లా అన్నసాగరం గ్రామానికి చెందిన తిరుపతి కొత్తగా ఇంటి నిర్మాణ పనులు చేపట్టాడు. కార్మికులు ఆదివారం పునాదుల కోసం గుంతలు తవ్వుతుండగా మురుగన్ విగ్రహం బయల్పడింది. సమాచారం అందుకున్న తహసీల్దార్ కాంచన, పోలీసులు అక్కడకు చేరుకుని విగ్రహం స్వాధీనం చేసుకున్నారు. ఈ విగ్రహం ఏ కాలానికి చెందినదనే విషయం పురావస్తు పరిశోధనల అనంతరం తెలుస్తుందని తహసీల్దార్ తెలిపారు.

అలరించిన సిద్ శ్రీరామ్ గాత్రకచేరి



ప్యారీస్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక మైలాపూర్‌లోని భారతీయ విద్యాభవన్‌లో మార్గళి సంగీతోత్సవంలో భాగంగా సంగీత కళాకారుడు, సినీ నేపథ్యగాయకుడు 'సిద్ శ్రీరామ్' గాత్రకచేరి శ్రోతలను ముగ్ధులను చేసింది. ఆదివారం సాయంత్రం సుమారు రెండున్నర గంటలపాటు కొనసాగిన ఈ సంగీతధారలో శ్రోతలు తన్మయత్వంలో మునిగిపోయారు. శ్రీరామ్ 'వక్రతుండ మహాకాయ' అంటూ గణేశ ప్రార్థనతో కచేరి ప్రారంభించారు. అనంతరం ఆలపించిన త్యాగరాజ కీర్తనలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. 'మధురాపురి నిలయే' అనే ముత్తుస్వామి దీక్షితార్ కృతి, 'తనమై ఇనమై కండే' అనే కల్కి ఆర్.కృష్ణమూర్తి రచన, పాపనాశం శివం విరచిత 'కర్పగమే' మొదలగు కీర్తనలతో సిద్ శ్రీరామ్ శ్రోతలకు వీనులవిందు గావించారు. హెచ్.ఎన్.భాస్కర్ (వయోలిన్), జె.వైద్యనాథన్ (మృదంగం), ఎస్.కార్తిక్ (ఘటం) తదితరులు వాద్య సహకారమందించారు.

రేపు గీతామందిరంలో లక్ష తులసీదళార్చన



ప్యారీస్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక జార్జిటౌన్ వరదాముత్తియప్పవీధిలోని గీతా మందిరంలో బుధవారం లక్ష తులసీదళార్చన నిర్వహించనున్నట్లు మద్రాస్ యతిరాజ సేవా మహిళ మండలి అధ్యక్షురాలు తవ్వా విజయలక్ష్మి పేర్కొన్నారు. మండలి 75యేళ్ల చరిత్రలో మొదటిసారిగా సామూహిక విష్ణుసహస్రనామం, తులసీ అర్చన, రాధాకృష్ణుల పూజలు చేయనున్నారు. ఈ సందర్భంగా సోమవారం మందిరంలో రాధాకృష్ణులకు ప్రత్యేక అలంకరణ, అభిషేకాలు నిర్వహించారు. మండలి ఆధ్వర్యంలో నిర్వహించే లక్ష తులసీదళార్చన పూజలో పాల్గొని స్వామివార్ల ఆశీస్సులు పొందాల్సిందిగా కమిటీ సభ్యులు, భక్తులకు విజయలక్ష్మి పిలుపునిచ్చారు.

'డెంగ్యూ'పై ప్రజలకు అవగాహన కల్పించాలి



కరపత్రాలు విడుదల చేస్తున్న నిర్వాహకులు

అడయార్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో వేగంగా వ్యాపించే 'డెంగ్యూ' జ్వరంపై ప్రజలకు అవగాహన కల్పించాలని లయన్స్ క్లబ్ సమావేశంలో తీర్మానం చేశారు. లయన్స్ క్లబ్ 3241-సి జిల్లా 6వ మండల మహానాడు ప్రెసిడెంట్ ఎస్‌కే ధనశేఖరన్ అధ్యక్షతన ఆదివారం సవేరా హోటల్‌లో జరిగింది. సమావేశంలో లయన్స్ క్లబ్ చేసిన సేవా కార్యక్రమాల నివేదిక ఖర్చుల వివరాలు ప్రవేశపెట్టారు. అలాగే, డెంగ్యూపై ప్రజలకు అవగాహన కల్పించేలా కరపత్రాల పంపిణీతో పాటు నీలవేము కషాయం ప్యాకెట్లు అందించాలని తీర్మానించారు. కార్యక్రమంలో, కె.అన్బరసన్, ఎ.ఆంతోని, వెంకటేశ్వరన్, విజయకుమార్,నారాయణన్, కన్నన్‌సహా సభ్యులు పాల్గొన్నారు.

విద్యతో పాటు
అన్ని రంగాల్లో రాణించాలి

- బీఈవో ఎస్.నళిని



విద్యార్థులతో ఆచార్య సీఎంకే రెడ్డి, బీఈవో నళిని తదితరులు

ప్యారీస్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యతో పాటు ఇతర రంగాల్లో రాణించాలని అన్నానగర్ బ్లాక్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ (బీఈవో) ఎస్.నళిని పేర్కొన్నారు. విల్లివాక్కంలోని శ్రీ కనకదుర్గ తెలుగు (ఎస్‌కేడీటీ) ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన అంతర్ పాఠశాలల కలరింగ్, డ్రాయింగ్ కంటెస్ట్-2025ను ఎస్‌కేడీటీ పాఠశాలలు, ఏఐటీఎఫ్ అధ్యక్షులు ఆచార్య సీఎంకే రెడ్డి సోమవారం ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా హాజరైన బీఈవో నళిని అన్నానగర్ బ్లాక్‌లో ఉన్న ఇతర ప్రాథమిక పాఠశాలలకు లేనిగుర్తింపు ఎస్‌కేడీటీ ప్రాథమిక పాఠశాలకు ఉందని, ఇక్కడ ఎలాంటి ఫీజు లేకుండా ఉచితంగా ఆంగ్లం మీడియంలో చదువుకునే సౌలభ్యాన్ని కల్పించడం ప్రశంసనీయమన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు విద్యలోనే కాకుండా ఇతర అంశాల్లో ప్రావీణ్యం పొందేలా కృషిచేస్తున్న ఎస్‌కేడీటీ యాజమాన్యం రాబోయే విద్యాసంవత్సరాల్లో కూడా ఇలాంటి మరిన్ని కార్యక్రమాలు నిర్వహించాలని ఆమె ఆకాంక్షించారు. ఈ పోటీల్లో ఎస్‌కేడీటీతో సహా 16 ప్రాథమిక పాఠశాలల విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కార్యదర్శి, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ సీఎం కిషోర్, డా.నందగోపాల్, కరస్పాండెంట్ డా.ఎస్ నాగభూషణం, ట్రెజరర్ ఎన్.నరసింహులు, ఎంవీఎన్ మహేంద్రబాబు, ప్రధానోపాధ్యాయురాలు ఎస్.రేణుక, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా వీఐటీ చాన్స్‌లర్ విశ్వనాథన్ జన్మదిన వేడుకలు



విశ్వనాథన్‌కు జ్ఞాపిక అందజేస్తున్న దృశ్యం

వేలూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వేలూరు వీఐటీ విశ్వవిద్యాలయం ఛాన్సలర్ విశ్వనాథన్ 86వ జన్మదినాన్ని పురస్కరించుకుని సోమవారం ఆయనకు కాట్పాడి రెడ్‌క్రాస్ తరుఫున అభినందన కార్యక్రమం జరిగింది. విద్యారంగానికి విశ్వనాథన్ చేస్తున్న సేవలు ప్రశంసనీయమని కొనియాడిన కాట్పాడి రెడ్‌క్రాస్ అధ్యక్షుడు ఎస్.ఎన్.జనార్థనన్ విశ్వనాథన్‌కు పుష్పగుచ్ఛం అందించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వీఐటీ ఉపాధ్యక్షులు శేఖర్ విశ్వనాథన్, జీవీ.కాదంబరి, సెల్వం ఆయనకు శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిల్ ఉపాధ్యక్షురాలు ఆర్.విజయకుమారి, జిల్లా నిర్వహణ కమిటీ సభ్యులు ఆర్.శ్రీనివాసన్, మెడికల్ కమిటీ ఛైర్మన్ వి.దీనబంధు, పీఎస్.రామచంద్రన్, ఆర్.సుధాకర్, సెక్రటరీ ఎస్ఎస్.శివడివులు, కోశాధికారి వి.పళని తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఏజీఎం విపిన్‌కుమార్ - పాల్గొన్న అధికారులు, సిబ్బంది

దక్షిణ రైల్వేలో 'మహా పరినివారణ్ దివస్'

పెరంబూర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్ వర్ధంతిని 'మహాపరినివారణ్ దివస్'గా నిర్వహించనున్నట్లు రైల్వే బోర్డు ప్రకటించింది. ఈప్రకారం సెంట్రల్ రైల్వేస్టేషన్ సమీపంలోని దక్షిణ రైల్వే ప్రధాన కార్యాలయంలో సోమవారం 'మహాపరినివారణ్ దివస్' నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ చిత్రపటానికి దక్షిణ రైల్వే అడిషినల్ జనరల్ మేనేజర్ విపిన్ కుమార్ పూలమాల వేసిన నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో పాల్గొన్న ఉన్నతాధికారులు, రైల్వే భద్రతాదళ అధికారులు, సిబ్బందిఅంబేద్కర్‌కు నివాళులర్పించారు. అలాగే, దక్షిణరైల్వే పరిధిలోని ప్రాంతీయ కార్యాలయాలు, వర్క్‌షాప్‌ల్లో కూడా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది.

ఘనంగా బాబు రాజేంద్రప్రసాద్
జయంతి



కార్యక్రమంలో నిర్వాహులు, అతిథులు

చెన్నై, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): భారత తొలి రాష్ట్రపతి భారతరత్న డాక్టర్ బాబు రాజేంద్ర ప్రసాద్ 141వ జయంతి వేడుకలు దేశరత్న డాక్టర్ రాజేంద్రప్రసాద్ మెమోరియల్ ట్రస్టు, ఏక్తావసూత్ర ఇండియా ఫౌండేషన్, ఆర్యసమాజ్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నగరంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో విద్యవేత్తలు, కార్పొరేట్ అధినేతలు, సాంస్కృతిక రాయబారులు, విద్యార్థులు, పౌరసమాజ సభ్యులు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సమాచార కమిషనర్ షకీల్ అఖ్తర్, రాష్ట్ర ఆరోగ్యశాఖ మాజీమంత్రి డాక్టర్ హెచ్‌వీ హండే ముఖ్య అతిథులుగా హాజరై ఉపన్యసించారు. ది సన్మార్ గ్రూప్ కార్పొరేట్ బోర్డు ఛైర్మన్ ఎన్.కుమార్, అర్జున,ద్రోణాచార్య అవార్డులగ్రహీత ఎస్.రామన్ ప్రత్యేక అతిథులుగా హాజరయ్యారు. సమాజానికి విశేషసేవలందించిన ముఖ్యులకు ఈసందర్భంగా పతిష్ఠాత్మక అవార్డులు ప్రదానం చేశారు.

నంది వాహనంపై
చండికేశ్వరుడి పురవిహారం



వేలూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలై అరుణాచలేశ్వరాలయంలో కార్తీక ఉత్సవాలు వైభవోపేతంగా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో, ఆదివారం రాత్రి చండికేశ్వరుడి ఉత్సవమూర్తికి ప్రత్యేక పూజల అనంతరం నందివాహనంపై కొలువుదీర్చారు.

అధికారిణిపై దాడిచేసిన ఆంధ్రా భక్తులపై కేసు..

అరుణాచలం ఆలయానికి రాష్ట్రంలోని పలు జిల్లాలతో పాటు కర్ణాటక, తెలంగాణ, కేరళ తదితర రాష్ట్రాలనుండి తరలివచ్చే వారిలో ఆంధ్రాకు చెందినవారే అధికం. ఈ నేపథ్యంలో, దర్శనం కోసం వేచివున్న క్యూలైన్‌లో రద్దీ పెరగడంలో తోపులాట జరిగింది. గమనించిన మేనక అనే పోలీసు అధికారిణి రద్దీని నివారించేందుకు రాగా, ఆమెపై తెలుగు భక్తులు దాడికి పాల్పడ్డారు. దీంతో ఆమెకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న తిరువణ్ణామలై పోలీసులు దాడికి పాల్పడిన ఆంధ్రా భక్తులపై కేసు నమోదు చేశారు. వీరు తిరుపతికి చెందిన సరిత, అర్పిత, వీరేష్, సాయినిత్, మాణిక్యారావుగా తెలిసింది.



తిరుపతిలో ఈట్ స్ట్రీట్ / జోరుగా సాగుతున్న పనులు

తిరుపతిలో ఎప్పటినుంచో ఎదురుచూస్తున్న ఈట్ స్ట్రీట్ (ఫుడ్ కోర్ట్)కు వేగంగా అడుగులు పడుతోంది. ప్రస్తుత నగరపాలక సంస్థ కార్యాలయానికి ఎదురుగా ఉన్న అచ్యుత దేవరాయలు మార్గంలో ఈ పనులు చురుగ్గా సాగుతున్నాయి. 40 నుంచి 50 స్టాళ్లు ఏర్పాటు చేయనున్నారు. 8/16 సైజుగల 12 కంటైనర్లను స్టాళ్లగా మార్చనున్నారు. మిగిలినవి నిర్దేశించిన ఖాళీ స్థలాన్ని స్టాళ్లగా మార్చుకునేందుకు టెండరుదారుకు కేటాయించనున్నారు. రెండు నెలల్లో పూర్తిచేసి, ఫుడ్ కోర్టు అందుబాటులోకి తీసుకురానున్నట్టు కార్పొరేషన్ వర్గాలు చెబుతున్నాయి. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఫుడ్ కోర్టు ఏర్పాటు చేయాలని ప్రయత్నాలు జరిగాయి. కపిలతీర్థం రోడ్డు, ఆర్టీసీ బస్టాండు ప్రాంతం, వెస్ట్ చర్చి ప్రాంతాలను పరిశీలించారు. కానీ కార్యరూపం దాల్చలేదు. కూటమి అధికారంలోకి వచ్చాక కమిషనర్ మౌర్య ఫుడ్ కోర్ట్‌పై ప్రత్యేక చొరవ చూపించారు. దాదాపు రూ.80లక్షలతో ఈట్ స్ట్రీట్ ఏర్పాటుకు కౌన్సిల్ ఆమోదం తీసుకుని అందుబాటులోకి తీసుకొస్తున్నారు. ఫుడ్ కోర్టులోని స్టాళ్లను టెండర్ల ద్వారా కేటాయించనున్నారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి


సర్వ దర్శనానికి 10 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 4 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 17 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శనివారం హుండీ ఆదాయం: రూ.3.69 కోట్లు

ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 75,343

తలనీలాలు సమర్పించినవారు: 26,505



పీజీఆర్ఎస్‌లో భూ సమస్యలే ఎక్కువ

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)కు జిల్లా వ్యాప్తంగా ప్రజలు తరలివచ్చారు. ముఖ్యంగా పింఛన్లు అందలేదని, ఇంటి పట్టాలకు స్థలం చూపలేదని, భూకబ్జాలపై చర్యలు తీసుకోవాలని, సంక్షేమ పథకాలు అందలేదని.. ఇలా వివిధ సమస్యలపై 308 అర్జీలు వచ్చాయి. అందులో భూ సమస్యలపైనే 184 ఉన్నాయి. అర్జీదారుల సమస్యలను విన్న కలెక్టర్ వెంకటేశ్వర్.. సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు. పీజీఆర్ఎస్‌కు వచ్చే ప్రతి అర్జీకి జవాబు ఇవ్వాలని నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు ఉంటాయని అధికారులను హెచ్చరించారు. కలెక్టర్‌తోపాటు డీఆర్వో నరసింహులు, ఎస్‌డీసీలు దేవేంద్రరెడ్డి, రోజ్మాండ్ తదితరులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.

పొలానికి దారి కల్పించండి



అయ్యా.. నాకు చంద్రగిరి మండలం భీమవరం రెవెన్యూ లెక్కదాఖల్లో 56సెంట్ల భూమి ఉంది. అక్కడికి వెళ్లే దారిని కొందరు ఆక్రమించారు. అడిగితే దౌర్జన్యం చేస్తున్నారు. రెవెన్యూ అధికారులు మా పొలాలకు హద్దులు చూపడంలేదు. మీరైనా కనికరించి హద్దులు చూపించండి.

- చల్లా రవి, కందులవారిపల్లి చంద్రగిరి మండలం

పరిహారం ఇవ్వండి



సూళ్లూరుపేట మండలం ఎర్రబాళెం గ్రామసర్వేలో వంద అంకణాలకుపైగా మా భూమి పోర్లుకట్టకు పోయింది. మిగిలిన భూమి హైవేకు పోయింది. ఇప్పటివరకు పరిహారం ఇవ్వలేదు. భూమి లేకపోవడంతో కుటుంబ పోషణకష్టంగా మారింది.మీరైనా ఆదుకోండి.

- బాలమురళీకృష్ణ, దివ్యాంగుడు, సూళ్లూరుపేట

వికలత్వ సర్టిఫికెట్ మంజూరు చేయండి



మా అబ్బాయి గోవర్ధన్‌కు రెండేళ్ల క్రితం నరాల బలహీనత ఏర్పడి నడవలేని స్థితికి చేరుకున్నాడు. వీల్‌చైర్‌కే పరిమితమయ్యాడు. ఆస్పత్రుల్లో చూపించినా ఫలితం కనిపించడం లేదు. మార్చిలో పదవ తరగతి పరీక్షలు రాయాల్సి ఉంది. డిజేబులిటీ సర్టిఫికెట్ మంజూరు చేయాలి.

- నాదముని, తొండవాడ, చంద్రగిరి మండలం



నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు - ఆందోళన చేస్తున్న అఖిల భారతీయ జనసంఘ్ నాయకులు

ఇళ్లస్థలాలు మంజూరు చేయండి

వేదాంతపురం పంచాయతీ రాందాసు కాలనీలోని పేదలకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలని సీపీఐ నగర కార్యదర్శి జల్లా విశ్వనాథ్ కోరారు. ఈ మేరకు కాలనీ వాసులతో కలిసి కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. గత ప్రభుత్వం పట్టాలు మంజూరు చేసి స్థలం చూపించకపోవడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా న్యాయం చేయాలని కోరారు. జిల్లాలో భూకబ్జాలను ప్రోత్సహించే అధికారులను కఠినంగా శిక్షించాలని అఖిల భారతీయ జనసంఘ్ నేతలు సుధాకర్ చౌదరి, రమణారెడ్డి, విజయశంకర్, రాజేంద్రప్రసాద్ తదితరులు కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేశారు.

మూడు చక్రాల వాహనం మంజూరు చేయండి



వికలత్వం కారణంగా వీల్‌చైర్‌కే పరిమితమయ్యాం. హోటల్‌లో కార్మికులుగా పనిచేస్తున్నాం. వికలత్వ కోటాలో మూడు చక్రాల మోటారు వాహనాన్ని మంజూరు చేసి ఆదుకోండి.

- జయశంకర్, జన్‌సుందర్‌రాజు, మదనంబేడు, సత్యవేడు

సమస్యల పరిష్కారంలో అలసత్వం వద్దు

- డయల్ యువర్ సీఎండీకి 70 వినతులు



విద్యుత్ వినియోగదారుల సమస్యలను వింటున్న సీఎండీ శివశంకర్

తిరుపతి(ఆటోనగర్), డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): సదరన్ డిస్కం పరిధిలోని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం చూపకుండా చర్యలు చేపట్టాలని సీఎండీ శివశంకర్ ఆదేశించారు. తిరుపతి కార్పొరేట్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 నుంచి 12 గంటల వరకు 'డయల్ యువర్ సదరన్ డిస్కం సీఎండీ' కార్యక్రమం నిర్వహించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, లోఓల్టేజ్ సమస్య, వ్యవసాయ విద్యుత్ సర్వీసులు మంజూరులో జాప్యం, కాలిపోయి, చోరీకి గురైన ట్రాన్స్‌ఫార్మర్లు త్వరితగతిన మార్చాలి, విద్యుత్ లైన్లు మార్పు చేయాలంటూ.. వివిధ సమస్యలపై 70 వినతులు వచ్చాయన్నారు. వీటిలో కర్నూలు నుంచి 18, కడప 13, అనంతపురం 15, నెల్లూరు 3, శ్రీసత్యసాయి3, చిత్తూరు1, తిరుపతి11, నంద్యాల 6 చొప్పున ఉన్నాయన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో దీర్ఘకాలంగా పరిష్కారం కాని సమస్యలను తన దృష్టికి తెస్తే ప్రాధాన్యమిచ్చి పరిష్కరిస్తామని చెప్పారు. టోల్ ఫ్రీ నెంబర్లు 1912, 1800 425155333 కి కాల్ చేసి సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు కె.గురవయ్య, పి.అయూబ్‌ఖాన్, కె.రామమోహనరావు, చీఫ్ జనరల్ మేనేజర్లు జె.రమణాదేవి, ఎన్.శోభావాలంటీనా, పి.హెచ్.జానకిరామ్, ఎం.మురళీకుమార్, కె.ఆదిశేషయ్య, ఎం.ఉమాపతి, జీఎంలు జి.చక్రపాణి, ఎం.కృష్ణారెడ్డి, రాజశేఖర్ రెడ్డి, డి.సురేంద్రరావు, పి.భాస్కర్‌రెడ్డి, ప్రసాద్, వెంకట రాజు, విజయన్ పాల్గొన్నారు.

ఈతకెళ్లి యువకుడి మృతి



ఈశ్వరయ్య(ఫైల్‌ఫొటో)

వాకాడు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఈతకెళ్లిన యువకుడు నీటిలో మునిగి మృతి చెందిన ఘటన మండలంలోని గొల్లపాళెంలో చోటుచేసుకుంది. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు... గొల్లపాళెం గ్రామానికి చెందిన విన్నమాల ఈశ్వరయ్య(37) సోమవారం సాయంత్రం 4 గంటల సమయంలో మహాలక్ష్మమ్మ దేవాలయం పక్కన ఉన్న గుంటలో ఈత కొట్టేందుకు దిగాడు. బయటకు రాకపోవడంతో స్థానికులు గాలించి మృతదేహాన్ని వెలికితీశారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని బాలిరెడ్డిపాళెం ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేశారు.

హామీ అమలు చేసేవరకు పోరాటం



విద్యాసంస్థల బంద్ పోస్టర్లను విడుదల చేస్తున్న జేఏసీ నాయకులు

గూడూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గూడూరును నెల్లూరు జిల్లాలో కలుపుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ ఇచ్చిన హామీ అమలు చేసేవరకు శాంతియుతంగా పోరాటం సాగిస్తామని జేఏసీ కన్వీనర్ దశరథరామిరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక టవర్ క్లాక్ సెంటర్ వద్ద జేఏసీ ఆధ్వర్యంలో రెండో రోజు రిలే దీక్ష నిర్వహించారు. సీపీఐ, విద్యార్థి, యువజన సంఘాల నాయకులు, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు దీక్షకు మద్దతు తెలిపాయి. ఈ సందర్భంగా జేఏసీ కన్వీనర్ మాట్లాడుతూ గూడూరును తిరుపతి జిల్లాలో కలపడం వల్ల ప్రజలు, ఉద్యోగులు అవస్థలు పడుతున్నారన్నారు. నియోజకవర్గ ప్రజల ఇబ్బందులను గుర్తించిన చంద్రబాబునాయుడు, లోకేశ్ గూడూరును నెల్లూరు జిల్లాలో కలుపుతామని హామీ ఇచ్చారని, తీరా జిల్లాల పునర్విభజనలో తుది ముసాయిదాలో ఈ అంశాన్ని చేర్చకపోవడంతో అన్యాయమన్నారు. గూడూరును నెల్లూరులో కలపాలని, లేనిపక్షంలో జిల్లా కేంద్రంగా ప్రకటించాలన్న డిమాండ్‌తో ఈ నెల 10వ తేదీన జేఏసీ ఆధ్వర్యంలో విద్యాసంస్థల బంద్ నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం విద్యాసంస్థల బంద్‌కు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో శ్రీకాంత్‌రెడ్డి, పవన్‌కుమార్, బాలకృష్ణంరాజు, శంకర్‌రెడ్డి, ప్రభాకర్, మనోజ్‌కుమార్, శశికుమార్, సునీల్ కుమార్, మణి, చంద్రమోహన్, నిరంజన్‌రెడ్డి, విజయ్‌కుమార్, మల్లికార్జున, శరత్, జమాలుల్లా తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ.10 లక్షల విరాళం



విరాళమిచ్చిన దాతలు

తిరుమల, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ.10 లక్షలు విరాళంగా అందింది. తిరుపతికి చెందిన భక్తవత్సలం, పీ చిరదీప్ కృష్ణ, ఉమా మహేశ్వరి ఈ విరాళాన్ని ఆదివారం తిరుమలలోని దాతల విభాగంలో అందజేశారు.

దామానెల్లూరు సచివాలయ ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు

సూళ్లూరుపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దామానెల్లూరు సచివాలయంలో పనిచేసే ఉద్యోగులకు ఎంపీడీవో మురళీకృష్ణ ఎట్టకేలకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. గత నెల 30న తుఫాన్ సమయంలో సచివాలయంలో పనిచేసే ఉద్యోగులు విధులకు డుమ్మా కొట్టారు. ఎంపీడీవో ఆ గ్రామ పరిశీలనకు వెళ్లగా ఈ విషయం బటయపడింది. దీనిపై ఈనెల 1వ తేదీన 'విపత్తు వేళా.. విధుల్లో ఉండరే!' శీర్షికన ఆంధ్రజ్యోతిలో వార్త ప్రచురితం అయింది. దీంతో జిల్లా అధికారులు ఆరా తీసి చర్యలకు ఆదేశించారు. అయితే మండలస్థాయి అధికారులు మీనమేషాలు లెక్కించడంతో జిల్లా అధికారులు మరోమారు ఎంపీడీవోను హెచ్చరించడంతో పంచాయతీ కార్యదర్శితో పాటు సచివాలయ సిబ్బందికి సోమవారం సాయంత్రం వాట్సప్ గ్రూపులో షోకాజ్ నోటీసులు జారీ చేశారు. అయితే సోమవారం 8వ తేదీ షోకాజ్ నోటీసులు జారీ చేస్తూ, ఈ నెల 3వ తేదీ ఇచ్చినట్లు పేర్కొనడం గమనార్హం. అందులోనూ ఐదు రోజుల ముందు తేదీ వేసి రెండు రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆదేశించారు.

సాయుధ దళాల పతాక దినోత్సవానికి విరివిగా విరాళాలివ్వండి



సాయుధ దళాల పతాక దినోత్సవానికి విరాళం అందజేస్తున్న కలెక్టర్

తిరుచానూరు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): దేశ రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన సైనికుల కుటుంబాలకు విరివిగా విరాళాలు అందజేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ పిలుపునిచ్చారు. సోమవారంరాత్రి కలెక్టరేట్‌లో ఆయన తన వంతు సాయంగా విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైనిక్ సంక్షేమాధికారి కేవీ రాఘవులు, మాజీ సైనిక సంఘ ప్రతినిధులు మనోహర్‌రెడ్డి, ఆనందరెడ్డి, కేశవ, జయప్రకాష్‌రెడ్డి, జయప్రకాష్, వెంకట్, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసు స్టేషన్లకు యువ ఎస్‌ఐలు



తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పోలీసు స్టేషన్లకు యువ ఎస్‌ఐలు వచ్చారు. 30 మంది పీఎస్‌ఐలను వివిధ స్టేషన్లకు పోస్టింగ్ ఇచ్చారు. ఇప్పటి వరకు ఎస్‌ఐలుగా పనిచేసిన కొందరిని వీఆర్‌కు, స్పెషల్ బ్రాంచ్‌కు, డీసీఆర్‌బీకి నియమించారు. తిరుపతిలో ఈస్ట్ పోలీసు స్టేషన్‌కున్న ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని కొత్తగా ముగ్గురు ఎస్‌ఐలను నియమించారు. వడమాలపేటకు ధర్మారెడ్డి స్థానంలో నూతన ఎస్‌ఐను నియమిస్తూ ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు. కాగా, యువ ఎస్‌ఐలు సోమవారం ఎస్పీ సుబ్బరాయుడిని మర్యాద పూర్వకంగా కలిశారు. మార్గదర్శకాలకు అనుగుణంగా పనిచేసి మంచి పేరు తెచ్చుకోవాలని ఎస్పీ వారికి సూచించారు. పోలీసు శాఖ ప్రతిష్టతను ప్రజల్లో ఇనుమడింపచేయాలని ఆదేశించారు. ఫ్రెడ్లీ పోలీసింగ్‌కు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. సమాజంలో అసాంఘిక శక్తుల ఆట కట్టించాలని అన్నారు.

నేటి ఎస్వీయూ డిగ్రీ పరీక్షల రద్దు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ పరిధిలో మంగళవారం నిర్వహించాల్సిన డిగ్రీ 3, 5వ సెమిస్టర్‌తో పాటు డిగ్రీ సప్లిమెంటరీ పరీక్షలు రద్దయ్యాయి. సాంకేతిక కారణాలతో ఈ పరీక్షలను రద్దు చేసినట్లు డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాళ్ళు, పరీక్షా కేంద్రాలకు ఎస్వీయూ పరీక్షల విభాగం సమాచారాన్ని పంపింది. బుధవారం నుంచి జరగాల్సిన పరీక్షలు యథావిధిగా ఉంటాయని సీఈ రాజమాణిక్యం తెలిపారు.

శ్రీసిటీలో సర్క్యులర్ ఎకానమీ, వ్యర్థాల రీసైక్లింగ్ పాలసీపై సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న కృష్ణయ్య

సత్యవేడు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ సర్క్యులర్ ఎకానమీ వ్యర్థాల రీసైక్లింగ్ పాలసీపై ఉన్నత స్థాయి సమావేశం సోమవారం శ్రీసిటీలో జరిగింది. రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి(ఏపీపీసీబీ) చైర్మన్ పి.కృష్ణయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ఆ శాఖ అధికారులు, పరిశ్రమల ప్రతినిధులు, పర్యావరణ నిపుణులు పాల్గొన్నారు. కాలుష్య నియంత్రణతో పాటు చెత్త నుంచి సంపద సృష్టించాలన్న రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలపై చర్చించారు. పి.కృష్ణయ్య, ఇతర ప్రతినిధులకు సాదర స్వాగతం పలికిన శ్రీసిటీ ప్రెసిడెంట్ సతీష్ కామత్, శ్రీసిటీ అమలు చేస్తున్న రెడ్యూస్, రీయూజ్, రీ సైకిల్(3ఆర్) విధానాల ప్రాధాన్యతను, నిబద్ధతను వివరించారు. ప్రత్యేకించి శ్రీసిటీ జీరో వ్యర్థలక్ష్యాలను ప్రస్తావిస్తూ.. స్కోర్ పోర్టల్‌ను వినియోగించుకుని శ్రీసిటీ ప్రాంతంలో 3ఆర్ పద్ధతులను మరింత బలోపేతం చేయాలంటూ పరిశ్రమ ప్రతినిధులకు పిలుపునిచ్చారు. శ్రీసిటీ సుస్థిర పర్యావరణ హిత కార్యక్రమాలను ప్రశంసించిన కృష్ణయ్య, ఈతరహా ఏకో సిస్టమ్‌ని అభివృద్ధి చేయడంలో ఇతర పారిశ్రామిక కేంద్రాలకు శ్రీసిటీ ఆదర్శంగా నిలుస్తుందన్నారు. శుద్ధి చేసిన మురుగునీటి పునర్వినియోగం, పారిశ్రామిక ఉప ఉత్పత్తులను రీసైకిల్, పునరుత్పాదక ఇంధన వినియోగాన్ని ప్రోత్సహించడం అత్యుత్తమ పద్ధతులుగా పేర్కొన్న ఆయన, వ్యర్థ నిర్వహణ ఏజెన్సీలు నిబంధనలను కచ్చితంగా పాటించాలని కోరారు. జీవ వైవిధ్య పరిరక్షణ, పచ్చదనం పెంపును శ్రీసిటీ పరిశ్రమలు బాధ్యతగా స్వీకరించడం సంతోషంగా ఉందన్నారు. శ్రీసిటీ సుస్థిరత ప్రణాళికను ప్రస్తావిస్తూ భవిష్యత్తుకు 3ఆర్ పద్ధతులు అనివార్యమని ఉద్ఘాటించారు. ఉపాధిసృష్టి, కాలుష్యనియంత్రణ మధ్య సమతుల్యతను పరిశ్రమలు పాటించాలని, ఇందుకోసం రెగ్యులర్ ఆడిట్లు, పర్యవేక్షణ అవసరమని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన సర్క్యులర్ ఎకానమీ విధానాన్ని వివరిస్తూ సర్క్యులర్ పార్కులు, 3ఆర్ సెంటర్లు, ప్లాస్టిక్ నిషేధం, చెత్త నిర్మూలన, ఎంఎస్ఎంఈలకు అవకాశాలు వంటి పలు కార్యక్రమాలు ఇందులో భాగంగా పేర్కొన్నారు. ఈ విధానం 2025 ఆగస్టులో రాష్ట్ర కేబినెట్ ఆమోదం పొందిందన్నారు. అన్ని రంగాల్లో 3ఆర్ సూత్రాల ప్రాతిపదికగా వ్యర్థాలను వనరులుగా మార్చి అమలు చేయడం ఈ విధానం లక్ష్యంగా వివరించారు. తన సందేశంలో ఏపీపీసీబీ చైర్మన్‌కు ధన్యవాదాలు తెలిపిన శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, సర్క్యులర్ ఎకానమీ, వ్యర్థాల పునర్వినియోగంపై సమగ్ర విధానాన్ని రూపొందించిన రాష్ట్ర ప్రభుత్వ దూరదృష్టిని, నాయకత్వాన్ని కొనియాడారు. సర్క్యులర్ ఎకానమీ సూత్రాల ఆచరణ, సుస్థిర పారిశ్రామిక ప్రగతి అంశాలలో శ్రీసిటీ కీలకపాత్ర పోషిస్తోందని ఆయన పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో ఏపీపీసీబీ సభ్యుడు నాగేశ్వరరాజు, సీనియర్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ మునిప్రసాద్‌తో పాటు ఆ శాఖకు చెందిన పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. శ్రీసిటీలోని వివిధ పరిశ్రమల నుంచి వంద మందికిపైగా మానవ వనరులు, పర్యావరణం, ఆరోగ్య, భద్రత మేనేజర్లు హాజరయ్యారు. సమావేశంలో వివిధ సమస్యలు, ప్లాస్టిక్ నిషేధం, వ్యర్థాల శుద్ధి వంటి అంశాలపై చురుకైన చర్చలు సాగాయి.

వైకుంఠ ఏకాదశికి సమన్వయంతో పనిచేయాలి



పోలీసు అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశి, ద్వాదశి రోజుల్లో భక్తుల రద్దీకి అనుగుణంగా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు, కష్టాలు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. తిరుపతిలోని కమాండ్ కంట్రోలు యూనిట్‌లో సోమవారం ఆయన జిల్లాలోని పోలీసు అధికారులతో వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లపై ముందస్తు సమావేశం నిర్వహించారు. తిరుమలకు భారీగా వచ్చే భక్తులను దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్, లైన్ మేనేజ్‌మెంటు, అత్యవసర స్పందన బృందాల నియామకం, పాదచారి మార్గాల భద్రత వంటి అంశాలపై చర్చించి కొన్ని కీలక నిర్ణయాలు తీసుకున్నారు. చిన్న పిల్లలు తప్పిపోకుండా ప్రత్యేక హెల్ప్ డెస్కులు, చైల్డ్ మిస్సింగ్ టీమ్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు.

పుష్కరిణి.. పులకింత

ఆహ్లాదకరంగా గడుపుతున్న ప్రజలు



వైష్ణవ కోనేరులో రంగు చేపలకు ఆహారం వేస్తున్న చిన్నారులు

శ్రీకాళహస్తి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి పట్టణంలోని కోనేర్లు నిండు జలాలతో కళకళలాడుతున్నాయి. పుష్కరిణిల వద్ద భక్తులు, స్థానికులు ఆహ్లాదకరంగా గడుపుతున్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయం సమీపంలోని భరద్వాజతీర్థం కోనేరులో ఇటీవల కురిసిన వర్షాలతో నిండుగా నీరు చేరింది. ఇక్కడ పచ్చని చెట్లు, ఉద్యానవనంగా సేద తీరే పరిసరాలతో పాటు నీటిపై సంచరించే బాతులు ఆకర్షిస్తున్నాయి. ముక్కంటి ఆలయానికి విచ్చేసే భక్తులతోపాటు స్థానికులు సాయంత్రం వేళ సరదాగా భరద్వాజ తీర్థం వద్దకు చేరుకుని ఉల్లాసంగా గడుపుతున్నారు.

భారీ రంగు చేపలు

శ్రీకాళహస్తి పట్టణం జయరామరావువీధిలోని వైష్ణవ పుష్కరిణిలో భారీ రంగుచేపలు పిల్లలు, పెద్దలను మైమరిపిస్తున్నాయి. వర్షాలకు పుష్కరణి నిండుగా మారడంతో సాయంత్రం వేళ చేపలకు ఆహారం వేసేందుకు పిల్లలు, పెద్దలు పుష్కరిణి వద్దకు చేరుకుని పులకిస్తున్నారు. ఐదేళ్ల కిందట కోనేరు ఎదురుగా ఉన్న ఓ అక్వేరియం షాపు నిర్వాహకుడు రంగు చేపలను పుష్కరిణిలో వదిలారు. అవి పెరుగుతూ వాటి సంతతిని వృద్ధి చేశాయి. దాంతో ఎక్కడా లేని విధంగా ఈ కోనేరులో వర్షాకాలంలో భారీ రంగు చేపలు గోల్డ్‌ఫిష్, వైట్, బ్లాక్ చేపలు ఆకర్షిస్తున్నాయి. ఇక, నారదపుష్కరణి కూడా నిండుకుండలా కనువిందుచేస్తోంది. ఉదయం, సాయంత్రం కోనేరులో స్థానికులు సేద తీరుతున్నారు.



భరద్వాజతీర్థం వద్ద సందడిగా..